సాక్షి నల్లగొండ

శుక్రవారం। 26। జనవరి। 2024



ఆలయాల్లో చోరీల ముఠా అరెస్టు

ఆలయాల్లో విగ్రహాలను అపహరిస్తున్న ముఠాను పోలీసులు అరెస్టు చేశారు. విగ్రహాలు, నగదును పట్టుకున్నారు. -IIలో



జాన్‌పహాడ్ ఉర్సు షురూ

పాలకవీడు మండలంలోని జాన్‌పహాడ్ దర్గా ఉర్సు గురువారం గుసుల్ షరీఫ్‌తో వైభవంగా ప్రారంభమైంది. -IVలో



జీవన మనుగడకు నాంది

ఓటు హక్కు జీవన మనుగడకు నాంది అని మహాత్మాగాంధీ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ గోపాల్‌రెడ్డి అన్నారు. -IVలో

న్యూస్‌రీల్

సీఎంఆర్ సేకరణ త్వరగా పూర్తిచేయాలి

నల్లగొండ: సీఎంఆర్ సేకరణ త్వరగా పూర్తిచేయాలని అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో గురువారం ఆయన అధికారులు, మిల్లర్లతో సీఎంఆర్ డెలివరీపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వానాకాలం (2022–23), యాసంగి (2022–23) సీఎంఆర్ సేకరణను గడువు లోగా పూర్తి చేయాలన్నారు. ఈ సమీక్షలో డీఎస్‌ఓ వెంకటేశ్వర్లు, డీఎం నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ కార్యాలయంలో ఓటరు దినోత్సవం



ప్రతిజ్ఞ చేస్తున్న ఏఎస్పీ తదితరులు

నల్లగొండ క్రైం: పద్దెనిమిదేళ్లు నిండిన ప్రతి పౌరుడు ఓటు హక్కు నమోదు చేసుకోవాలని ఏఎస్పీ హనుమంతరావు అన్నారు. గురువారం జిల్లా పోలీస్ కార్యాలయంలో జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా పోలీస్ అధికారులతో కలిసి ప్రతిజ్ఞ చేయించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీలు విఠల్‌రెడ్డి, శ్రీనివాస్‌లు, ఏఓ శ్రీనివాస్, ఆర్‌ఐలు సంతోష్, హరిబాబు, నరేష్ పాల్గొన్నారు.

పోలీస్ అధికారులకు సేవా పతకాలు

నల్లగొండ క్రైం: జిల్లాలో వివిధ ప్రాంతాల్లో పనిచేస్తున్న ఎనిమిది మంది పోలీసు అధికారులకు ప్రభుత్వం గురువారం పోలీస్ సేవా, ఉత్కృష్ట పతకాలను ప్రకటించింది. పోలీస్ సేవా పతకం పొందిన వారిలో ఎస్‌ఐ శంకరయ్య (వీఆర్), ఏఎస్‌ఐ ఉపేంద్ర స్వామి (మహిళా పోలీస్ స్టేషన్ నల్లగొండ), ఏఎస్‌ఐ వెంకటనారాయణ (నల్లగొండ వన్ టౌన్), హెడ్ కానిస్టేబుల్ వెంకటేశ్వర్లు(మిర్యాలగూడ టూ టౌన్), హెడ్ కానిస్టేబుల్ అలీ అహ్మద్(నిడమనూరు), హెడ్ కానిస్టేబుల్ లజనర్ యాసిన్ షరీఫ్ (మిర్యాలగూడ వన్ టౌన్), అలాగే ఉత్కృష్ట సేవా పతకం పొందిన వారిలో హెడ్‌కానిస్టేబుల్ సుదర్శన్(నల్లగొండ వన్ టౌన్), హెడ్ కానిస్టేబుల్ బ్రహ్మచారి(నల్లగొండ టూటౌన్) ఉన్నారు. పోలీస్ శాఖలో అంకితభావంతో విధులు నిర్వహించినందుకు వీరందరికీ పోలీస్, ఉత్కృష్ట సేవా పతకాలను ప్రభుత్వం ప్రకటించినట్టు జిల్లా పోలీస్ శాఖ పేర్కొంది.

టీసీసీ సర్టిఫికెట్లు తీసుకెళ్లాలి : డీఈఓ

నల్లగొండ: తెలంగాణ ప్రభుత్వం ఆగస్టు –2023లో నిర్వహించిన టెక్నికల్ టీచర్స్ సర్టిఫికెట్ (టీసీసీ) కోర్సులైన డ్రాయింగ్, టైలరింగ్, ఎంబ్రాయిడరీ లోయర్ గ్రేడ్లలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు సర్టిఫికెట్లను తీసుకెళ్లాలని డీఈఓ భిక్షపతి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. నల్లగొండలోని జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలోని పరీక్షల విభాగంలో సర్టిఫికెట్లు అందజేస్తారని పేర్కొన్నారు.



పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో రంగులు వేస్తున్న సిబ్బంది



వేడుకల కోసం సిద్ధం చేసిన వేదిక, వీఐపీల గ్యాలరీ

గణతంత్ర వేడుకలకు పరేడ్ గ్రౌండ్ ముస్తాబు

నల్లగొండ, నల్లగొండ రూరల్: 75వ గణతంత్ర వేడుకలకు జిల్లా కేంద్రంలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్ ముస్తాబైంది. శుక్రవారం ఉదయం 9 గంటలకు కలెక్టర్ హరిచందన జాతీయ పతాకాన్ని ఆవిష్కరించనున్నారు. అనంతరం వివిధ కార్యక్రమాలు జరగనున్నాయి. పరేడ్ గ్రౌండ్‌లో ఏర్పాట్లను గురువారం నల్లగొండ ఆర్డీఓ రవి పరిశీలించారు. వీఐపీలకు గ్యాలరీ, సాంస్కృతిక కార్యక్రమాలు, స్టాళ్ల ఏర్పాట్లపై నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా పోలీసులు రిహార్సల్స్ నిర్వహించారు.

వికసించిన పద్మాలు

ముగ్గురికి పద్మశ్రీ అవార్డులు



రామన్నపేట మండలం వెల్లంకిలోని కూరెళ్ల గ్రంథాలయంలో పుస్తకం చదువుతున్న విఠలాచార్య

- జిల్లాకు చెందిన కూరెళ్ల విఠలాచార్య, కేతావత్ సోమ్‌లాల్..
- యాదాద్రి ప్రధాన స్థపతి సలహాదారుడు వేలు ఆనందచారి పురస్కారాలకు ఎంపిక

రామన్నపేట : కేంద్రం ప్రకటించిన అత్యున్నతమైన పద్మశ్రీ పురస్కారాలకు ముగ్గురు ఎంపికయ్యారు. వీరిలో ఇద్దరు జిల్లావాసులతో పాటు యాదాద్రి ఆలయ ప్రధాన స్థపతి సలహాదారుడు ఉన్నారు. తన ఇంటిని గ్రంథాలయంగా మలచి ఎందరికో విజ్ఞాన వెలుగులు ప్రసాదించిన కవి కూరెళ్ల విఠలాచార్య, భగవద్గీతను బంజారా భాషలోకి అనువదించి తన జాతిని జాగృత పరిచిన కేతావత్ సోమ్లాల్, యాదాద్రి ఆలయ పునర్నిర్మాణంలో ప్రధాన స్థపతి సలహాదారుడిగా పనిచేసిన డాక్టర్ ఏ.వేలు ఆనంద చారిని పద్మశ్రీ అవార్డులు వరించాయి.

స్ఫూర్తిగా నిలిచిన కూరెళ్ల విఠలాచార్య

రామన్నపేట మండలం వెల్లంకి గ్రామానికి చెందిన కవి డాక్టర్ కూరెళ్ల విఠలాచార్య 1938 జూలై 7న కూరెళ్ల లక్ష్మమ్మ – వెంకటరాజయ్య దంపతులకు జన్మించారు. ఐదేళ్ల ప్రాయంలో తండ్రి లాలనకు కూరెళ్ల దూరమయ్యారు. తల్లి లక్ష్మమ్మ అనేక కష్టాలకు ఓర్చి కుమారుని చదివించింది. కూరెళ్లకు ముగ్గురు కుమార్తెలు నర్మద, తపతి, సరస్వతి వివిధ హోదాల్లో స్థిరపడ్డారు. పోస్టల్ శాఖలో చిన్న ఉద్యోగంలో చేరిన కూరెళ్ల ఆ తరువాత అధ్యాపక వృత్తిలో ప్రవేశించారు. 35 ఏళ్ల పాటు ఉపాధ్యాయుడిగా, జూనియర్, డిగ్రీ కళాశాలల్లో తెలుగు ఉపన్యాసకులుగా పనిచేశారు. తాను పనిచేసిన చోటల్లా విద్యార్థుల్లో పఠనాసక్తిని పెంచడానికి కృషిచేశారు. పాఠశాలల్లో గ్రంథాలయాల కోసం ప్రత్యేక గదిని ఏర్పాటు చేయించారు. విద్యార్థుల్లో పఠనాసక్తితో పాటు రచనా వ్యాసాంగాన్ని పెంపొందించడానికి బాపూభారతి, మన తెలుగుతల్లి, తొలివెలుగు, మన పురోగమనం, చిరంజీవి, ప్రియంవద, ముచికింద వంటి పత్రికలు నిర్వహించారు. ప్రభుత్వాని కంటే ముందే 1960 దశకంలో భువనగిరి మండలం వడాయిగూడెంలో అక్షరాస్యతా ఉద్యమం నిర్వహించి వయోజనులకు రాత్రివేళల్లో చదువు నేర్పారు. ఉద్యోగ విరమణ అనంతరం తాను సమకూర్చిన వేలాది పుస్తకాలతో గ్రంథాలయం ఏర్పాటు చేయాలని సంకల్పించారు. తన ఇంటిని గ్రంథాలయంగా మార్చి కూరెళ్ల గ్రంథాలయంగా నామకరణం చేశారు. ఆరు ఎకరాల వ్యవసాయ భూమిని బలహీనవర్గాల ఇళ్ల స్థలాలకోసం ప్రభుత్వానికి అందజేశారు. అక్కడ నిర్మించిన కాలనీకి తన తల్లి స్మారకార్థం లక్ష్మీనగర్‌గా నామకరణం చేశారు.

సాహితీరంగంలో విశేష కృషి

కూరెళ్ల తాను చదువుకునే రోజుల్లోనే రచనలపై దృష్టి సారించారు. తెలుగులో గొలుసుకట్టు నవలలు, స్వాతంత్ర్యోద్యమం – ఆంధ్రప్రదేశ్‌లో దాని స్వరూపం, విఠలేశ్వర శతకం, తెలుగు నవలల్లో స్వాతంత్ర్యోద్యమ చిత్రణ, స్మృత్యంజలి, కవితాచందనం, పంచమి, మా వూరి వెలుగు, శిల్పాచార్యులు, కాన్ఫిడెన్సియల్ రిపోర్ట్ నాసీనేత్రాలు వంటి అనేక రచనలు చేశారు. చైతన్య కళాశ్రవంతి, అక్షర కళాభారతి, స్పందన, స్ఫూర్తి, ప్రజాభారతి వంటి అనేక సాహితీసంస్థలను నెలకొల్పారు.

గ్రంథాలయంలో రెండు లక్షల పుస్తకాలు

2014 ఫిబ్రవరి 13న వెల్లంకిలోని తన స్వంత ఇంట్లో గ్రంథాలయం ఏర్పాటు చేశాడు. గ్రంథాలయ నిర్వహణకోసం ఆచార్య కూరెళ్ల ఫౌండేషన్ ఏర్పాటు చేశారు. పుస్తకాల్లో ఏళ్లనాటి వార్తపత్రికలతోపాటు పద్యగద్య గ్రంథాలు విజ్ఞాన సర్వసాలు, ప్రత్యేక సంచికలు, వ్యక్తిత్వ వికాసం, ప్రాచీన గ్రంథాలు, బాలసాహిత్యం, విద్య, వైద్యం చరిత్ర, రామాయణం, మహాభారతం, రాజకీయం, పోటీపరీక్షలకు ఉపయోగపడే గ్రంథాలు ఉన్నాయి. ప్రస్తుతం గ్రంథాలయంలోని పుస్తకాల సంఖ్య 2లక్షలకు చేరింది. పరిశోధక విద్యార్థులు కూరెళ్ల గ్రంథాలయం బాట పడుతున్నారు. ఇల్లు శిథిలావస్థకు చేరడంతో దాతల సహకారంతో సుమారు రూ.50లక్షల వ్యయంతో నూతన భవనం నిర్మించారు.

అనేక పురస్కారాలు

కూరెళ్ల సాహిత్యప్రతిభకు గుర్తింపుగా అనేక పురస్కారాలు దక్కాయి. 2019లో దాశరథి పురస్కారం, 2018లో పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం వారి విశిష్ట పురస్కారంతో పాటు మరెన్నో అవార్డులు వరించాయి. మన్‌కీ బాత్‌లో ప్రధాన మంత్రి నరేంద్రమోదీచే ప్రశంసలు పొందారు.


కళా నైపుణ్యానికి గుర్తింపు



చిత్రాలు గీస్తున్న ఆనందచారి

యాదగిరిగుట్ట: యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి ప్రధానాలయ పునర్నిర్మాణ ప్రధాన స్థపతి సలహాదారుడిగా సేవలు అందించిన డాక్టర్ ఏ.వేలు ఆనందచారికి పద్మశ్రీ అవార్డు దక్కింది. ఆలయ పునర్నిర్మాణంలో భాగంగా 2018లో ప్రధాన స్థపతి సలహాదారుడిగా ఆనందచారి నియామకం అయ్యారు. ఉద్ఘాటన సమయం వరకు ఆనంద చారి వేలు సలహాదారుడిగా పని చేశారు. ఆనంద చారి యాదాద్రితో పాటు పలు ఆలయాల్లో శిల్పిగా, సలహాదారుడిగా, పర్యవేక్షకుడిగా విధులు నిర్వహించారు. వేలు ఆనందచారికి శిల్ప కళా విభూషణ్, ఔషధ కళా శిల్పి బిరుదులు లభించాయి. ప్రస్తుతం ఆయన కేరళలోని శుభానంద ఆశ్రమంలో ఐదంతస్తుల రాతి ఆలయ నిర్మాణ పర్యవేక్షణ చూస్తున్నారు.

బంజారా జాతికి ఆదర్శం సోమ్‌లాల్



తాను అనువదించిన భగవద్గీతను చూపుతున్న సోమ్‌లాల్

సాక్షి యాదాద్రి : భువనగిరి మండలం ఆకుతోట బావి తండాకు చెందిన సోమ్‌లాల్ నంద్యాలలోని ఎస్‌బీఐ డిప్యూటీ మేనేజర్‌గా పనిచేస్తున్నాడు. సాహిత్య అభిలాషి అయిన ఈయన బంజారా జాతి జాగృతం కోసం కంకణం కట్టుకున్నాడు. వారిని చైతన్య పరుస్తూ 200లకు పైగా పాటలు రాశాడు. 1988లో భగవద్గీతను బంజారా భాషాలోకి అనువాదాన్ని మొదలు పెట్టాడు.16నెలల కృషితో పూర్తి చేశాడు. 1989 నాటికే భగవద్గీత అనువాదం పూర్తయిన అచ్చవడానికి సోములాల్ 25ఏళ్లు నిరీక్షించాడు. ఎన్నో ఒడుదుడుకుల తర్వాత బంజారా భగవద్గీతను తిరుమల తిరుపతి దేవస్థానానికి అందజేశారు.

అర్హులంతా ఓటరుగా నమోదు కావాలి



ర్యాలీలో పాల్గొన్న కలెక్టర్, అధికారులు

- కలెక్టర్ హరిచందన
- నల్లగొండలో జాతీయ ఓటరు దినోత్సవ ర్యాలీ



మాట్లాడుతున్న కలెక్టర్ హరిచందన

నల్లగొండ: పద్దెనిమి సంవత్సరాలు నిండిన అర్హులైన ప్రతిఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ హరిచందన దాసరి పిలుపునిచ్చారు. గురువారం 14వ జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా నల్లగొండ జిల్లా కేంద్రంలో ఎన్‌జీ కళాశాల వద్ద చేపట్టిన అవగాహన ర్యాలీని ఆమె జెండా ఊపి ప్రారంభించారు. ప్లకార్డులు ప్రదర్శిస్తూ ఎన్జీ కళాశాల నుంచి రామగిరి మీదుగా క్లాక్ టవర్ వరకు సాగిన ర్యాలీలో కలెక్టర్‌తోపాటు వివిధ శాఖల జిల్లా అధికారులు, కళాశాలల విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం క్లాక్ టవర్ సెంటర్ వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. పట్టణ ప్రాంతాల్లో ఓటింగ్ శాతం పెంచేందుకు అవగాహన కల్పించాలన్నారు. 80 ఏళ్లు దాటిన వయోవృద్ధులు, నడవలేని స్థితిలో ఉన్న దివ్యాంగులకు ఇంటి వద్ద నుంచి ఓటు వేసేందుకు ఎన్నికల సంఘం అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు. ఓటరు జాబితాలో తమ పేరు ఉందో లేదో ప్రతిఓటరూ చెక్ చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా నూతన ఓటర్లకు ఫొటో ఓటరు గుర్తింపు కార్డు అందజేశారు. త్వరలో జరగనున్న నల్లగొండ–వరంగల్–ఖమ్మం పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికలో అర్హత కలిగిన పట్టభద్రులు కొత్తగా ఓటరుగా నమోదు చేసుకోవాలన్నారు. ఆ తర్వాత 90 సంవత్సరాలు దాటిన వయో వృద్ధ ఓటర్లను శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి చొల్లేటి ప్రభాకర్, జెడ్పీ సీఈఓ ప్రేమ్‌కరణ్‌రెడ్డి, ఆర్డీఓ రవి, సమాచార హక్కు పరిరక్షణ సమితి జాతీయ చైర్మన్ బొమ్మరబోయిన కేశవులు పాల్గొన్నారు.

ధాన్యం రవాణా రేట్లు ఖరారు



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ హరిచందన, అధికారులు

నల్లగొండ: కొనుగోలు కేంద్రాల నుంచి మిల్లులకు, గోదాముల నుంచి ఎంఎల్‌ఎస్ పాయింట్లకు రవాణా చేసే ధాన్యం, బియ్యానికి సంబంధించి షెడ్యూల్ రేట్లను ప్రభుత్వం ఖరారు చేసిందని కలెక్టర్ హరిచందన తెలిపారు. గురువారం రాష్ట్ర పౌర సరఫరాల శాఖ కమిషనర్ డీఎస్.చౌహాన్.. జిల్లా కలెక్టర్లు, రవాణా శాఖ సంయుక్త కమిషనర్ ఎఫ్‌సీఐ జీఎంలతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌కు ఆమె హాజరై మాట్లాడారు. షెడ్యూల్ ఆఫ్ రేట్లను 5 స్లాబ్‌లుగా నిర్ణయించారని పేర్కొన్నారు. స్లాబ్–1 0నుంచి 8 కి.మీ. వరకు మెట్రిక్ టన్నుకు రూ.221.50 (ఫ్లాట్ రేటు), స్లాబ్–2 8నుంచి 20 కి.మీ.వరకు రూ.3.90, స్లాబ్–3 20నుంచి 40 కి.మీ.వరకు రూ.3.40, స్లాబ్–4 40నుంచి 80 కి.మీ.వరకు రూ.3లు, స్లాబ్–5 ప్రకారం 80 కి.మీ. మించి దూరం ఉంటే రూ.2.60గా రాష్ట్రస్థాయి కమిటీ ఖరారు చేసిందన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, పౌర సరఫరాల సంస్థ డీఎం నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఫిబ్రవరి 1నుంచి ఇంటర్ ప్రాక్టికల్స్

- జనరల్ విభాగానికి 83.. ఒకేషనల్ విద్యార్థులకు 21 కేంద్రాలు
- వివరాలు వెల్లడించిన డీఐఈఓ దస్రునాయక్

నల్లగొండ: ఫిబ్రవరి 1వ తేదీ నుంచి 15వ తేదీ వరకు ఇంటర్ ప్రయోగ పరీక్షలు (ప్రాక్టికల్స్) నిర్వహించనున్నట్టు డీఐఈఓ దస్రునాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు పరీక్షలు జరగనున్న పరీక్షలకు అన్ని ఏర్పాట్లు చేశామని పేర్కొన్నారు. జనరల్ విభాగం విద్యార్థుల కోసం 83 పరీక్ష కేంద్రాలు, ఒకేషనల్ విభాగంలో 21 పరీక్ష కేంద్రాల్లో పరీక్షలు ఉంటాయని చెప్పారు. సైన్స్ ప్రయోగాలలో మొత్తం 15,583 మంది, ఒకేషనల్ కోర్సులో ప్రథమ సంవత్సరం 1,486 మంది, ద్వితీయ సంవత్సరం 1,318 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు తెలిపారు. ఫిబ్రవరి 16వ తేదీ నుంచి ప్రథమ సంవత్సర విద్యార్థులకు ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు మొదటిసారిగా ఆంగ్లంలో ప్రయోగ పరీక్షలు జరుగుతాయని పేర్కొన్నారు. 17వ తేదీన గత సంవత్సరం రాయని వారు, ఫెయిలైన విద్యార్థులకు ఎథిక్స్, హ్యూమన్ వ్యాల్యూస్ పరీక్ష ఉదయం 10 గంటల నుంచి 1 గంట వరకు ఉంటుందని, 19వ తేదీ ఉదయం 10 గంటల నుంచి ఒంటిగంట వరకు ఎన్విరాన్మెంట్ పరీక్ష ఆయా కళాశాలల్లో నిర్వహించబడుతుందన్నారు. పరీక్షలకు హైపవర్ కమిటీ చైర్మన్‌గా జిల్లా కలెక్టర్ హరిచందన, మెంబర్లుగా ఎస్పీ చందనాదీప్తి, ఆర్‌జేడీ, డీఐఈఓ తదితరులు ఉన్నారన్నారు. ప్రత్యేక ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు పరీక్షలను పర్యవేక్షిస్తాయని తెలిపారు.

పబ్లిక్ హెల్త్ టీఎన్‌జీఓ కమిటీ ఎన్నిక



సభ్యులను సన్మానిస్తున్న శ్రవణ్‌కుమార్

నల్లగొండ టౌన్: తెలంగాణ పబ్లిక్ హెల్త్ మున్సిపల్ ఇంజనీరింగ్ శాఖ నాన్ గెజిటెడ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ నూతన కమిటీని గురువారం నల్లగొండలో జరిగిన సర్వసభ్య సమావేశంలో టీఎన్‌జీఓ జిల్లా అధ్యక్షుడు, ఎంప్లాయీస్ జేఏసీ చైర్మన్ మంత్రవాది శ్రవణ్‌కుమార్ సమక్షంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అసోసియేషన్ అధ్యక్షుడిగా ఎండీ.ఆజం, కార్యదర్శిగా ఎస్.సుదర్శన్, సహ అధ్యక్షుడిగా వి.శివప్రసాద్, కోశాధికారిగా జి.శ్రీరమ్య, ఉపాధ్యక్షులుగా ఎస్‌కే.షరీఫ్, వై.నరేష్, సహాయ కార్యదర్శులుగా ఎల్.సాగర్, ఏ.రాజశేఖర్ రెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీగా పి.ఆశీష్‌బాబు, ప్రచార కార్యదర్శిగా ఎస్.అఖిల్‌కుమార్, ఉమెన్స్ కార్యదర్శిగా బి.లక్ష్మి, గౌరవ సలహాదారుగా ఏ.ఉమామహేశ్వరి, కార్యవర్గ సభ్యులుగా ప్రణీత, సుజాత, లావణ్య ఎన్నికయ్యారు. అనంతరం కమిటీ సభ్యులను టీఎన్‌జీఓ ప్రతినిధులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో టీఎన్‌జీఓ జిల్లా కార్యదర్శి కె.కిరణ్‌కుమార్, కోశాధికారి మేడి జయరావు, ఉపాధ్యక్షుడు జే.శేఖర్‌రెడ్డి, దుర్గా పాల్గొన్నారు.

టీఎస్‌పీఎస్సీలో జిల్లావాసులు

సభ్యులుగా పాల్వాయి రజనీకుమారి, నర్రి యాదయ్య నియామకం



సూర్యాపేట, సంస్థాన్‌నారాయణపురం: తెలంగాణ స్టేట్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(టీఎస్‌పీఎస్సీ)లో ఉమ్మడి నల్లగొండ జిల్లావాసులకు చోటు దక్కింది. కాంగ్రెస్ నాయకురాలు పాల్వాయి రజనీకుమారి, ప్రొఫెసర్ నర్రి యాదయ్యను కమిషన్ సభ్యులుగా నియమితులయ్యారు. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఉత్తర్వులు జారీ చేశారు.

రజనీ నేపథ్యం

సూర్యాపేటకు చెందిన పాల్వాయి రజనీకుమారి 1972 మే 6న పాల్వాయి రాములు, భారవి దంపతులకు జన్మించారు. ఆమె 2000 సంవత్సరంలో గ్రూప్ –1కు ఎంపికయ్యారు. 2000 నుంచి 2004 వరకు హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని ఖైరతాబాద్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్‌గా పనిచేశారు. ఉత్తమ అధికారిగా అప్పటి రాష్ట్ర మంత్రి దేవేందర్‌గౌడ్ చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. 2004లో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పిలుపు మేరకు ఉద్యోగానికి రాజీనామా చేసి టీడీపీలో చేరారు. అనంతరం సూర్యాపేట అసెంబ్లీ నియోజకవర్గం నుంచి పోటీ చేసి ఓటమి పాలయ్యారు. ఆ తరువాత టీడీపీలో వివిధ హోదాల్లో పనిచేశారు. తిరిగి 2014 అసెంబ్లీ ఎన్నికల్లో తుంగతుర్తి నియోజకవర్గం నుంచి మరోసారి ఎమ్మెల్యేగా పోటీ ఓడిపోయారు. 2018లో బీజేపీలో చేరి 2023 వరకురాష్ట్ర నాయకురాలిగా కొనసాగారు. 2023 అక్టోబర్‌లో కాంగ్రెస్‌లో చేరారు. ఆమెకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి టీఎస్‌పీఎస్సీ సభ్యురాలిగా అవకాశం కల్పించారు.

> **బాధ్యతను సక్రమంగా నిర్వర్తిస్తా**
>
> టీఎస్‌పీఎస్సీ సభ్యురాలిగా నాకు అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ధన్యావాదాలు. వందలాది మంది బలిదానాలతో సాధించుకున్న తెలంగాణ రాష్ట్రంలో ఉద్యోగాలు లేక నోటిఫికేషన్ల కోసం నిరుద్యోగ యువత ఎదురుచూస్తుంది. రాష్ట్రంలో 2లక్షల ఉద్యోగాలు భర్తీ చేసేందుకు ముఖ్యమంత్రి కృతనిశ్చయంతో ఉన్నారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన తప్పిదాలను దృష్టిలో ఉంచుకొని ఉద్యోగాల భర్తీలో నా వంతు బాధ్యత నిర్వర్తిస్తా. – పాల్వాయి రజనీకుమారి

టీఎస్‌పీఎస్సీ చైర్మన్ మహేందర్‌రెడ్డి సర్వేల్ విద్యార్థి

టీఎస్‌పీఎస్సీ చైర్మన్‌గా నియమితులైన మాజీ డీజీపీ మహేందర్‌రెడ్డి సర్వేల్ గురుకులం పూర్వ విద్యార్థి. ఆయన 5వ తరగతి నుంచి 10వ తరగతి వరకు సర్వేల్ గురుకుల పాఠశాలలో విద్యనభ్యసించారు. 1978లో పదో తరగతి పూర్తి చేశారు. ఇంటర్మీడియట్ నాగార్జునసాగర్‌లోని రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలలో పూర్తి చేశారు.

అంచెలంచెలుగా ఎదిగిన నర్రి యాదయ్య



నర్రి యాదయ్య

టీఎస్‌పీఎస్సీ సభ్యుడిగా నియమితులైన నర్రి యాదయ్య సొంతూరు యాదాద్రి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండలం మల్లారెడ్డిగూడెం. ఆయన తల్లిదండ్రులు దుర్గయ్య, మల్లమ్మలు. 10వ తరగతి వరకు సర్వేల్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో చదువుకున్నారు. ఇంటర్మీడియట్ హైదరాబాద్‌లోని న్యూ మలక్‌పేట్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పూర్తి చేశారు. 1988లో ఉస్మానియా యూనివర్సిటీ నుంచి ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్, అక్కడే ఎంటెక్ కూడా పూర్తి చేశారు. 1991లో ఐఐటీ ఖరగ్‌పూర్‌లో కంట్రోల్ సిస్టమ్స్‌లో పీహెచ్‌డీ చేశారు. హైదరాబాద్‌లోని జేఎన్‌టీయూలో 1991లో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా చేరారు. 2006లో జేఎన్‌టీయూలోనే ప్రొఫెసర్‌గా పదోన్నతి లభించింది. జేఎన్‌టీయూ వైస్ ప్రిన్సిపాల్‌గా, ప్రిన్సిపాల్‌గా అనంతరం 2015 నుంచి 2020వరకు జేఎన్‌టీయూ రిజిస్ట్రార్‌గా కొనసాగారు. 2020 నుంచి సీనియర్ ప్రొఫెసర్‌గా పని చేస్తున్నారు. జర్నల్ ఆఫ్ కంప్యూటర్ సైన్స్ సభ్యుడిగా, సిస్టిమ్స్ ఆఫ్ ఇండియా శాశ్వత సభ్యుడిగా కొనసాగుతున్నారు.

అనేక అవార్డులు..

నర్రి యాదయ్య తన 31 ఏళ్ల సర్వీస్‌లో అనేక అవార్డులు అందుకున్నారు. 1999లో యంగ్ సైంటిస్ట్, 2014లో ఇంజనీరింగ్‌లో ఇయర్, 2015లో మెరిటోరియస్ టీచర్ అవార్డులు 2019లో నేషనల్ సిస్టమ్స్‌లో గోల్డ్ మెడల్ అందుకున్నారు. వివిధ పరిశోధనల నిమిత్తం కెనడా, అమెరికా, మలేషియా, స్వీడన్, ఫ్రాన్స్, ఇటలీ, సింగపూర్ దేశాల్లో పర్యటించారు. యాదయ్య చేసిన పరిశోధనలకు సంబంధించిన అంతర్జాతీయ, జాతీయ పత్రికల్లో ప్రచురితమయ్యాయి. అనేక సమావేశాలకు ఆయన అధ్యక్షతన వహించారు. ఎంసెట్, టీసెట్‌తో పాటు ఎన్నో ప్రవేశ పరీక్షలకు కన్వీనర్‌గా పని చేశారు.

> **నమ్మకాన్ని నిలబెట్టుకుంటా**
>
> నాపై ప్రభుత్వం ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటా. టీఎస్‌పీఎస్సీ సభ్యుడిగా నాకు అవకాశం కల్పించినందుకు ప్రభుత్వానికి కృతజ్ఞతలు. నిరుద్యోగుల ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేస్తా. – నర్రి యాదయ్య

క్లుప్తంగా

పురుగుల మందు తాగి యువకుడి ఆత్మహత్య


ఉపేందర్ (ఫైల్)

అడవిదేవులపల్లి: మద్యానికి బానిసైన ఓ యువకుడు కుటుంబ సభ్యులు మందలించారని పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన అడవిదేవులపల్లి మండల కేంద్రంలో బుధవారం రాత్రి జరిగింది. ఎస్ఐ హరిబాబు తెలిపిన వివరాల ప్రకారం.. అడవిదేవులపల్లి మండల కేంద్రానికి చెందిన ఏకుల ఉపేందర్(24) ఆటో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. మద్యానికి బానిసైన ఉపేందర్ ప్రతిరోజు తాగి ఇంటికి వెళ్తుండడంతో బుధవారం కుటుంబ సభ్యులు మందలించారు. దీంతో మనస్తాపానికి గురైన ఉపేందర్ బుధవారం రాత్రి 10గంటల సమయంలో పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు గమనించి అతడిని మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు ఎస్ఐ తెలిపారు. మృతుడి సోదరుడు ఏకుల మహేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

మిర్యాలగూడ టౌన్: గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన మిర్యాలగూడ మండలంలోని ఆలగడప గ్రామ శివారులో బుధవారం రాత్రి జరిగింది. మిర్యాలగూడ రూరల్ ఎస్ఐ దోరేపల్లి నర్సింహులు తెలిపిన వివరాల ప్రకారం.. సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల మున్సిపాలిటీ పరిధిలోని నర్సయ్యగూడేనికి చెందిన నన్నెపంగు మహేష్(22) మిర్యాలగూడ పట్టణంలోని గాంధీనగర్‌లో తల్లి మహబూబాతో కలిసి నివాసముంటున్నాడు. అతడి తండ్రి గతంలోనే మృతిచెందాడు. కూలీ పనులు చేసుకుంటూ తల్లిని పోషిస్తున్నాడు. బుధవారం రాత్రి తల్లితో గొడవపడిన మహేష్ తన స్వగ్రామం నర్సయ్యగూడేనికి వెళ్తున్నానంటూ ఆమెకు చెప్పి బయటకు వెళ్లాడు. ఇంటి నుంచి నడుచుకుంటూ బయల్దేరిన మహేష్‌ను మిర్యాలగూడ మండలం ఆలగడప గ్రామ శివారులోని భారత్ పెట్రోల్ బంక్ సమీపంలో కోదాడ-జడ్చర్ల జాతీయ రహదారిపై అర్ధరాత్రి గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. రాజేష్ అనే వ్యక్తి గమనించి అంబులెన్స్‌కు సమాచారం అందించాడు. మహేష్‌ను మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు. మృతుడి తల్లి మహబూబా ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఆలయాల్లో చోరీల ముఠా అరెస్ట్

- 268 కిలోల దేవతామూర్తుల పంచలోహ విగ్రహాలు, నగదు స్వాధీనం
- ఏడుగురిపై కేసు నమోదు


వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ వెంకటేశ్వరబాబు


స్వాధీనం చేసుకున్న విగ్రహాలతో పోలీసులు

తొర్రూరు: మహబూబాబాద్ జిల్లా తొర్రూరు డివిజన్ పరిధిలోని పలు ఆలయాల్లో విగ్రహాలను అపహరిస్తున్న ముఠాను పోలీసులు అరెస్ట్ చేశారు. పలు కేసుల్లో నిందితులైన వీరి నుంచి 268 కిలోల బరువైన పలు దేవతామూర్తుల పంచలోహ విగ్రహాలు, రూ.60వేల నగదు స్వాధీనం చేసుకున్నారు. డీఎస్పీ వెంకటేశ్వరబాబు గురువారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. నల్లగొండ జిల్లా నకిరేకల్ ప్రాంతానికి చెందిన ఆవుల సంజీవ, నాగిళ్ల నాగరాజు, ఎడ్ల వెంకటమ్మ, ఎడ్ల పున్నమ్మ, నాగిళ్ల దుర్గ, గోపగాని రాజమ్మ బొగ్గు లారీల్లో లోడింగ్ పనులకు వెళ్లేవారు. పని లభించనప్పుడు ప్లాస్టిక్ సామాన్లు సేకరించి వాటిని విక్రయించి జీవనం సాగించేవారు. ఈ పనుల ద్వారా వచ్చే అరకొర డబ్బులు సరిపోక పోవడంతో సులభ పద్ధతిలో డబ్బు సంపాదించే మార్గాలు అన్వేషించారు. తాళం వేసి ఉన్న ఇళ్లను టార్గెట్ చేసి చోరీలకు పాల్పడడం ప్రారంభించారు. ఈ క్రమంలో వారిపై నల్లగొండ జిల్లా కేతేపల్లి, కట్టంగూర్, తుంగతుర్తి పోలీస్ స్టేషన్లలో కేసులు నమోదు కావడంతో పాటు కొంతకాలం జైలుకెళ్లారు. జైలు నుంచి బయటకు వచ్చిన అనంతరం కూడా వారి తీరు మారలేదు. సొంత ప్రాంతంలో చోరీలకు పాల్పడితే పట్టుబడుతున్నామని భావించి గతేడాది జూన్‌లో తొర్రూరు డివిజన్ పరిధిలో ప్లాస్టిక్ వ్యర్థాలు సేకరిస్తున్నట్లు నటిస్తూ ఆలయాల్లో చోరీలకు తెరతీశారు. తొర్రూరు మండలం మాటేడు వేణుగోపాలస్వామి ఆలయం, అమ్మాపురంలోని సీతారామస్వామి ఆలయం, దంతాలపల్లి మండలం పెద్దముప్పారంలోని వెంకటేశ్వరస్వామి ఆలయం, మరిపెడ మండలం గుండెపుడిలోని సీతారామస్వామి ఆలయాల్లో విలువైన దేవతామూర్తుల పంచలోహ విగ్రహాలను చోరీ చేశారు. మరిపెడ మండలం ఎల్లంపేట గ్రామ శివారు, జమ్మికుంట తండాల్లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ధ్వంసం చేసి 45 కిలోల కాపర్ వైరు అపహరించారు. సదరు ఆలయ సామగ్రి, కాపర్ వైరును నల్లగొండ జిల్లా కేతేపల్లికి చెందిన చింతల పుల్లారావుకు విడతల వారీగా విక్రయించారు. పలు ఆలయాల నిర్వాహకులు ఈ ఘటనపై ఫిర్యాదు చేయగా పోలీసులు సీసీ ఫుటేజీల ఆధారంగా దర్యాప్తు చేపట్టారు. నిందితుల నుంచి 268 కిలోల గరుడ వాహనం, అశ్వ వాహనం, ఆంజనేయస్వామి విగ్రహం, ఇత్తడి గొడుగు, దివిటీలు, ఇత్తడి చెంబులు, హనుమంతుడి వాహనం, 45 కిలోల కాపర్ వైరు, రూ.60 వేల నగదు స్వాధీనం చేసుకున్నారు. రవాణాకు వినియోగించిన ఆటో ట్రాలీని సీజ్ చేశారు. చోరీలకు పాల్పడిన ఆరుగురిపై, సదరు సామగ్రి కొనుగోలు చేసిన దుకాణదారుడిపై కేసు నమోదు చేసినట్లు డీఎస్పీ తెలిపారు. వారిని కోర్టులో హాజరుపర్చి రిమాండ్‌కు తరలిస్తామన్నారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్లు అప్పగింత


బాధితులకు ఫోన్లు అప్పగిస్తున్న డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి

నల్లగొండ క్రైం: గత నెల రోజుల వ్యవధిలో నల్లగొండ పట్టణంలోని వివిధ ప్రాంతాలకు చెందిన 30 మంది పోగొట్టుకున్న సెల్‌ఫోన్లను నల్లగొండ డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి జిల్లా పోలీస్ కార్యాలయంలో గురువారం బాధితులకు అప్పగించారు. సెల్‌ఫోన్లు పోగొట్టుకున్న బాధితులు సెంట్రల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్(సీఈఐఆర్) పోర్టల్‌లో దరఖాస్తు చేసుకోగా.. ఫోన్లు చోరీ చేసిన వ్యక్తులు సిమ్‌కార్డు మార్చి మరో సిమ్ ఫోన్‌లో వేసి ఉపయోగించడంతో సీఈఐఆర్ పోర్టల్‌కు మెసేజ్ వస్తుంది. దీంతో కర్ణాటక, రాజస్తాన్, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లోని వివిధ ప్రాంతాల్లో ఈ ఫోన్లను ఉపయోగించగా వారందరి దగ్గర నుంచి ఫోన్లను రికవరీ చేసి బాధితులకు అప్పగించినట్లు డీఎస్పీ తెలిపారు. ఫోన్లు రికవరీ చేసిన కానిస్టేబుల్ బాలకోటిని డీఎస్పీ అభినందించి నగదు రివార్డు అందజేశారు. కార్యక్రమంలో సీఐ పీఎన్‌డీ ప్రసాద్, టూటౌన్ ఎస్ఐ నాగరాజు పాల్గొన్నారు.

చౌటుప్పల్ మున్సిపాలిటీ సమస్యలపై వారంలో సమీక్ష

- ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి


ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న కాంగ్రెస్ కౌన్సిలర్లు

చౌటుప్పల్: చౌటుప్పల్ మున్సిపాలిటీలో నెలకొన్న సమస్యలపై అధికారులతో వారం రోజుల్లో ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహిస్తానని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి తెలిపారు. కాంగ్రెస్ పార్టీకి చెందిన మున్సిపల్ కౌన్సిలర్లు గురువారం ఎమ్మెల్యేను హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలుసుకుని మున్సిపాలిటీ పరిధిలోని గ్రామాలు, వార్డుల వారీగా నెలకొన్న సమస్యలను ఆయనకు వివరించారు. పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. కోతులు, కుక్కలు, పందులతో ప్రజలు నరకం అనుభవిస్తున్నారని తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రధాన సమస్యల పరిష్కారం కోసం ఎప్పటికప్పుడు అధికారులకు ఆదేశాలు ఇస్తున్నామన్నారు. చౌటుప్పల్‌ను మోడల్ పట్టణంగా తీర్చిదిద్దడమే తన లక్ష్యమని తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు కొయ్యడ సైదులుగౌడ్, ఉబ్బు వరమ్మ, కాసర్ల మంజుల, పోలోజు వనజ, కామిశెట్టి శైలజ, అంతటి విజయలక్ష్మి, సందగళ్ల విజయ, నాయకులు ఉబ్బు వెంకటయ్య, కాసర్ల శ్రీనివాస్‌రెడ్డి, పోలోజు అనిల్‌చారి, కాంశెట్టి భాస్కర్, అంతటి బాలరాజు, సందగళ్ల సతీష్, తదితరులు ఉన్నారు.

లారీని ఢీకొట్టిన కారు.. యువతి మృతి

కోదాడరూరల్ : ముందు వెళ్తున్న లారీని కారు వెనుక నుంచి ఢీకొట్టడంతో యువతి మృతిచెందింది. ఈ ఘటన కోదాడ మండల పరిధిలోని చిమిర్యాల క్రాస్‌రోడ్ సమీపంలో గల చెక్‌పోస్టు వద్ద గురువారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని విజయవాడకు చెందిన జంగం కీర్తిసోనిక(23) తన స్నేహితుడితో కలిసి వైద్య చికిత్స నిమిత్తం కారులో హైదరాబాద్ వెళ్లారు. తిరిగి విజయవాడ వెళ్తుండగా మార్గమధ్యలో కోదాడ మండల పరిధిలోని చిమిర్యాల శివారులో జాతీయ రహదారిపై గల చెక్‌పోస్టు వద్ద లారీని వెనుక నుంచి ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో కీర్తిసోనిక తీవ్రంగా గాయపడగా, ఆమె స్నేహితుడికి స్వల్ప గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం కీర్తిసోనికను కోదాడకు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందింది. మృతురాలి తండ్రి ఆనంద్‌కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఒలింపియాడ్‌లో సత్తా చాటిన 'జయ' విద్యార్థులు


ప్రతిభ కనబరిచిన విద్యార్థులతో పాఠశాల యాజమాన్యం

సూర్యాపేటటౌన్: న్యూఢిల్లీలోని సైన్స్ ఒలంపియాడ్ ఫౌండేషన్ వారు ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన ఇంటర్నేషనల్ మ్యాథమెటిక్స్ ఒలింపియాడ్‌లో సూర్యాపేట జిల్లా కేంద్రంలోని జయ పాఠశాల విద్యార్థులు సత్తా చాటారు. పాఠశాల నుంచి మొత్తం 67 మంది విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచి రెండో లెవల్‌కు అర్హత సాధించినట్లు పాఠశాల కరస్పాండెంట్ జయ వేణుగోపాల్ గురువారం తెలిపారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను కరస్పాండెంట్‌తో పాటు డైరెక్టర్లు బింగి జ్యోతి, జెల్లా పద్మ అభినందించారు.

'గ్రామీణ కృషి అనుభవం'తో విద్యార్థులకు మేలు


విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న కేవీకే శాస్త్రవేత్తలు

గరిడేపల్లి: బీఎస్సీ వ్యవసాయ డిగ్రీ చదువుతున్న విద్యార్థులకు గ్రామీణ కృషి అనుభవ కార్యక్రమంతో ఎంతో మేలు జరుగుతుందని గరిడేపల్లి మండలంలోని గడ్డిపల్లిలో గల కృషి విజ్ఞాన కేంద్రం(కేవికే) ఇన్‌చార్జి సీనియర్ శాస్త్రవేత్త డి. నరేష్ అన్నారు. గడ్డిపల్లి కేవీకేలో హైదరాబాద్‌లోని మల్లారెడ్డి యూనివర్సిటీకి చెందిన బీఎస్సీ వ్యవసాయ డిగ్రీ విద్యార్థులకు నిర్వహిస్తున్న గ్రామీణ వ్యవసాయ అనుభవ కార్యక్రమం గురువారం ముగిసింది. ఈ ముగింపు సమావేశంలో సీనియర్ శాస్త్రవేత్త నరేష్ ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులకు సూచనలు చేశారు. కేవీకే శాస్త్రవేత్తల పర్యవేక్షణలో విద్యార్థులు వివిధ గ్రామాల్లో ఉంటూ వ్యవసాయ స్థితిగతుల గురించి అధ్యయనం చేశారని అన్నారు. అనంతరం గ్రామీణ కృషి అనుభవం పూర్తి చేసుకున్న విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్తలు సీహెచ్. నరేష్, డి. ఆదర్శ్, మాధురి, కోఆర్డినేటర్ నరేష్, అసిస్టెంట్ ప్రొఫెసర్ యువరాజ్ తదితరులు పాల్గొన్నారు.

దాబాలపై పోలీసుల దాడులు

- మద్యం బాటిళ్లు సీజ్
- 11 దాబాలపై కేసులు నమోదు


జనగామ క్రాస్ రోడ్డులోని దాబాలో తనిఖీలు చేస్తున్న పోలీసులు

సూర్యాపేట క్రైం: సూర్యాపేట పట్టణంతోపాటు 65వ నంబర్ జాతీయ రహదారి వెంట ఉన్న దాబాలు, దుకాణాలపై జిల్లా ఎస్పీ రాహుల్ హెగ్డే ఆదేశాల మేరకు గురువారం సీసీఎస్ పోలీసులు, స్థానిక పోలీసులు ఆకస్మికంగా దాడులు చేశారు. 21 దాబాలపై దాడులు చేసి మద్యం తాగుతున్న వారితో పాటు మద్యం అమ్ముతున్న దాబాల యజమానులను గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. మద్యం బాటిళ్లు సీజ్ చేసి, 11 దాబాలపై కేసులు నమోదు చేసినట్లు సీసీఎస్ సీఐ నాగార్జున గౌడ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జాతీయ రహదారి వెంట రోడ్డు ప్రమాదాల నివారణలో భాగంగా దాబాలపై దాడులు చేసినట్లు తెలిపారు. చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

హిట్ అండ్ రన్ చట్టాన్ని రద్దు చేయాలి


కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ నాయకులు

భువనగిరిటౌన్: డ్రైవర్ల జీవితాలు నాశనం చేసేలా ఉన్న హిట్ అండ్ రన్ చట్టాన్ని రద్దు చేయాలని ఆలిండియా రోడ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ కేంద్ర కమిటీ సభ్యుడు కల్లూరి మల్లేశం డిమాండ్ చేశారు. ట్రాన్స్‌పోర్ట్ యూనియన్ రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు గురువారం యాదాద్రి కలెక్టరేట్ ఎదుట ఫెడరేషన్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కల్లూరి మల్లేశం మాట్లాడుతూ.. హిట్ అండ్ రన్ బిల్లుపై పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీలో అభ్యంతరాలు తెలియజేసినప్పటికీ తమకు మెజారిటీ ఉందని కేంద్ర ప్రభుత్వం రాజ్యసభ, లోక్‌సభలో ఈ బిల్లును ప్రవేశపెట్టిందని విమర్శించారు. ట్రక్ డ్రైవర్ల మెరుపు సమ్మెతో తాత్కాలికంగా బిల్లును నిలిపివేస్తున్నట్లు ప్రకటించిందని, కానీ చట్టాన్నే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం అదనపు కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎండీ పాషా, జిల్లా సహాయ కార్యదర్శి మాయ కృష్ణ, నాయకులు చాట్ల నగేష్, గుండెబోయిన బలరాం, సత్తయ్య, రాజయ్య యాదగిరి, లింగం తదితరులు పాల్గొన్నారు.

సత్తాచాటిన గురుకుల విద్యార్థులు



గవర్నర్ తమిళిసై చేతుల మీదుగా బహుమతి అందుకుంటున్న గురుకుల విద్యార్థులు

మోటకొండూర్: జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా గురువారం హైదరాబాద్‌లోని జేఎన్‌టీయూలో ఎన్నికల కమిషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన నూతన ఓటరు నమోదు అవగాహన పోటీల్లో యాదాద్రి భువనగిరి జిల్లా మోటకొండూర్ మండలంలోని మహాత్మా జ్యోతిరావు పూలే బాలికల గురుకుల పాఠశాలకు చెందిన 10వ తరగతి విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు నాటకాల రూపంలో ఇచ్చిన ప్రదర్శనకు రాష్ట్రస్థాయి ద్వితీయ బహుమతి సాధించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ విద్యార్థులకు బహుమతి అందించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ జ్యోతి, టీచర్ స్పందన, విద్యార్థులు రితిక, కావేరి, ఝాన్సీ, పూజా, నవ్యశ్రీ, మహాలక్ష్మి, అఖిల, స్పందన, సౌమ్య పాల్గొన్నారు.

ఇసుక లారీ పట్టివేత

కోదాడరూరల్: ఎలాంటి అనుమతులు లేకుండా ఆంధ్రప్రదేశ్ నుంచి కోదాడ వైపు వస్తున్న ఇసుక లారీని గురువారం కోదాడ రూరల్ పోలీసులు పట్టుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఎన్టీఆర్ కృష్ణా జిల్లా జగ్గయ్యపేట మండలంలోని రావిరాల ఇసుక రీచ్ నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా లారీలో ఇసుకను లోడ్ చేసుకుని రెడ్లకుంట మీదుగా కోదాడ వైపు వస్తుండగా గుడిబండ శివారులో పోలీసులు పట్టుకున్నారు. లారీ యజమాని, డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

సాక్షి క్లాసిఫైడ్స్

Real Estate

VILLAS FOR SALE

■ Ready to Occupy Duplex Luxury 3 BHK - 2340 Sft Villas in The Best Gated Community At Miryalaguda. Next to New D-Mart. Club House, Swimming Pool Fully Operational Must See Call: 7013578378. [H-787916]

Wanted

■ ఉమ్మడి నల్గొండ జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల వారికి మా సంస్థలో ఉద్యోగాలు. జీతం: 14వేలు+ 6వేలు బోనస్ + ఫ్రీ రూం. Q: 10th, ఇంటర్, ITI, డిప్లొమా (P/F). సెల్: 85198 91505. [L-822324]

■ ప్రముఖ కంపెనీలో పార్ట్ టైం మాన్యువల్ రైటింగ్ వర్క్ చేయుటకు స్త్రీ/పురుషులు కావలెను. వీక్లీ పేమెంట్. మీ పేరు, అడ్రస్ కాల్/వాట్సప్ చేయగలరు. 91777 36926. [M-1233759]

■ హరేకృష్ణ హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్/నర్సులు కావలెను. ఫ్రీ వసతి+ భోజనం. జీ : 18K. Ph: 9640258899, 9640468899 [H-793680]

■ Niva Buba హెల్త్ ఇన్సూరెన్స్ కంపెనీ నల్లగొండ నందు పనిచేయుటకు అనుభవం గల మేనేజర్లు కావలెను. ఆకర్షణీయమైన జీతం ఇవ్వబడును. సంప్ర॥ 9121160377 [Y-798412]

■ నల్లగొండ పట్టణంలో బట్టల షాపులో పనిచేయుటకు అనుభవం కలిగిన లేడీ సేల్స్‌మెన్స్ కావలెను. జీతం : 8000 - 12000 సంప్ర॥ 98663 22323 [Y-798307]

■ ప్రముఖ కంపెనీలో ఫుల్‌టైం, పార్ట్ టైం జాబ్స్ అవకాశం. అర్హత 10th to డిగ్రీ, MBA, B.Tech, హౌస్‌వైఫ్స్, ఎంప్లాయిస్ (ఎటువంటి ఫీజు లేదు) సంప్ర॥ 6281817942 [Y-798414]

Services

BUSINESS OFFER

■ 18-28 సం॥ల యువతి యువకులకు,RS 49 K స్వల్ప పెట్టుబడిలోకల్‌ఫ్రాంచైజీతో పర్మినెంట్‌బిజినెస్ ఆదాయం. మల్టీ సర్వీసెస్+ట్రైనింగ్+డైలీ సపోర్ట్@15 సం॥ల నమ్మకమైన సర్టిఫైడ్ సంస్థ W.W.I-Hyd. Ph: 9908743603 [HA-2583]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతి స్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటన దారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

పూత, పిందెను నిలుపుకుంటేనే దిగుబడులు

- మామిడి సాగులో జాగ్రత్తలు పాటించాలి
- పెద్దవూర ఉద్యావనశాఖ అధికారి రవినాయక్


పాడి పంట

పెద్దవూర: జిల్లాలో ఈ యేడాది మామిడి పంటలో పూత ఆశాజనకంగా ఉంది. మామిడి సాగులో పూత, పిందె ఎక్కువగా వాతావరణ పరిస్థితులపై ఆధారపడి ఉంటుంది. పూత, పిందెను నిలుపుకుని నాణ్యమైన అధిక దిగుబడి సాధించాలంటే జాగ్రత్తలు పాటించాలని పెద్దవూర ఉద్యావనశాఖ అధికారి రవినాయక్ సూచిస్తున్నారు. మామిడి సాగులో సస్యరక్షణలను ఆయన వివరించారు.

మామిడిలో పూల రకాలు

మామిడిలో ఉండే పూల గుత్తిలో రెండు రకాల పుష్పాలు ఉంటాయి. వీటిలో ఒకటి ద్విలింగ పుష్పాలు, రెండో రకం మగ పుష్పాలు. ప్రతి పూల గుత్తిలో రకాన్ని బట్టి 200 నుంచి 4000 వరకు పుష్పాలు ఉంటాయి. ద్విలింగ పుష్పాలు రకాన్ని బట్టి మారుతూ ఉంటాయి. ఉదాహరణకు రుమాని రకంలో 0.74 శాతం, నీలం రకంలో 55శాతం, బంగనపల్లిలో 22శాతం ద్విలింగ పుష్పాలు ఉంటాయి. ద్విలింగ పుష్పాలు మాత్రమే ఫలదీకరణ చెంది పిందెలుగా ఏర్పడుతాయి. మగ పూలు ఫలదీకరణంలో తోడ్పడి తర్వాత రాలిపోతాయి. ద్విలింగ పుష్పాల్లో కూడా ఫలదీకరణానికి ముందే పలు కారణాలతో రాలిపోతాయి. కొంతవరకు పూత, పిందె రాలడం సహజమే అయినా వాటి తీవ్రతను బట్టి తగు జాగ్రత్తలు తీసుకోవాలి.


పూత దశలో ఉన్న మామిడి చెట్టు

హార్మోన్ల యాజమాన్యం

హార్మోన్ల లోపం, సమతుల్యత దెబ్బతింటే పూత, పిందె బాగా రాలుతుంది. దీని నివారణకు 5 లీటర్ల నీటిలో మిల్లీలీటర్ ప్లానోఫిక్స్ మందును కలుపుకుని పిచికారీ చేసుకోవాలి. ఈ మందును మోతాదుకు మించి పిచికారీ చేస్తే పిందె రాలిపోయే ప్రమాదం ఉంది. దీన్ని జాగ్రత్తగా పిచికారీ చేసుకోవాలి.

భూమిలో తేమ

వేసవికాలంలో భూమిలోని తేమ ఆవిరి అవడంతో నీటి ఎద్దడికి గురై పూత, పిందె రాలిపోతుంది. అలాగే నీరు ఎక్కువగా పెట్టినా, వర్షం ఎక్కువగా కురిసినా పూత, పిందె ఎక్కువగా రాలిపోతుంది. గోలికాయ సైజు పిందె దశలో ఉన్నప్పుడు ఆ తర్వాత నెలకోసారి రెండు తడులు ఇవ్వాలి. దీంతో కాయరాలడం తగ్గడంతో పాటు నాణ్యత పెరిగి కాయ పరిమాణం కూడా పెరుగుతుంది.

చీడపీడలు

మామిడికి చీడపీడలు పూత, పిందె దశలో ఆశించడంతో బాగా రాలిపోతాయి. పురుగు, తెగుళ్లను జాగ్రత్తగా గమనిస్తూ తగు చర్యలు తీసుకోవాలి.

తేనె మంచు పురుగు

పూత, పిందె దశలో ఈ పురుగు ఎక్కువగా ఆశిస్తుంది. పిల్ల పురుగులు గుంపులు, గుంపులుగా చేరి రసాన్ని పీల్చివేయడంతో పూత మాడిపోతుంది. దీని నివారణకు ఇమిడాక్లోప్రిడ్ అనే మందును తగిన మోతాదులో వాడుకోవాలి.

తామర పురుగులు

తామర పురుగులు రసాన్ని పీల్చడంతో పూత రాలిపోతుంది. పిందె దశలో కాయపై గోకి రసాన్ని పీల్చడంతో మచ్చలు ఏర్పడుతాయి. ఇవి ఆశించిన కాయలపై మంగు ఏర్పడుతుంది. వీటి నివారణకు డైమిథోయేట్‌ను లీటరు నీటికి 2 మిల్లీలీటర్లు కలిపి పిచికారీ చేయాలి.

బూడిద తెగులు

ఆకులు, పూత, పిందెలపై తెల్లని బూడిద వంటి పొడి ఏర్పడుతుంది. తెగులు సోకిన పూత, పిందెలు రాలిపోతాయి. దీని నివారణకు పూత, మొగ్గ దశలో లీటరు నీటికి 2 మిల్లీలీటర్ల హెక్సాకోనజోల్‌ను కలిపి పిచికారీ చేయాలి.

పోషకాల యాజమాన్యం

మామిడి కాయలు అంగుళం పరి మాణం నుంచి భుజాలు ఏర్పడే వరకు చాలా త్వరగా పెరుగుతాయి. ఈ సమయంలో పోషకాలైన నత్రజని, పొటాష్‌ను తప్పక అందించాలి. నీటి వసతి ఉన్న పొలాల్లో చెట్టు వయస్సును బట్టి 500 గ్రాముల నుంచి కిలో వరకు. 300 గ్రాముల పొటాష్‌ను పిందెలు బాదం కాయ పరిమాణంలో ఉన్నప్పుడు వేసి నీరు పెట్టాలి. నీటి వసతి లేని తోటల్లో నీటిలో కరిగే ఎరువులైన పాలీఫీడ్, మల్టీ-కే ఎరువులు లీటరు నీటికి 10 గ్రాముల చొప్పున కలిపి పిచికారీ చేయాలి.

క్లుప్తంగా

పీడీఎస్‌యూ ఉపాధ్యక్షుడిగా వినీత్ కుమార్

మునుగోడు: పీడీఎస్‌యూ జిల్లా ఉపాధ్యక్షుడిగా మునుగోడు మండలంలోని పులిపలుపుల గ్రామానికి చెందిన బొల్గూరి వినీత్ కుమార్‌ను గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మూడు రోజులపాటు నల్లగొండలో జరిగిన పీడీఎస్‌యూ జిల్లా మహాసభల్లో జిల్లా కమిటీని ఎన్నుకోగా అందులో వినీత్ కుమార్‌కు చోటుదక్కింది.

దివ్యాంగులకు బస్‌పాస్ మేళా

మర్రిగూడ: మండల కేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో గురువారం దివ్యాంగులకు ఆర్టీసీ అధికారులు బస్‌పాస్ మేళా నిర్వహించారు. అర్హులైన పలువురు దివ్యాంగులకు బస్‌పాస్‌లు అందజేశారు. నల్లగొండ జిల్లా డిపో ఇన్‌చార్జ్ వి.కృష్ణారెడ్డి, సర్పంచ్ నల్ల యాదయ్య, కంట్రోలర్ శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌డీ పట్టా పొందిన కోతులారం వాసి


కందుల జగదీశ్వర్

మునుగోడు: మండలంలోని కోతులారం గ్రామానికి చెందిన కందుల జగదీశ్వర్‌గౌడ్ ఉస్మానియా యూనివర్సిటీలో మెకానికల్ ఇంజనీరింగ్ విభాగంలో పీహెచ్‌డీ పట్టా పొందారు. కందుల నర్సింహ–రాములమ్మ దంపతుల ఆరుగురు సంతానంలో ఐదుగురు ఆడపిల్లలు, చిన్న కుమారుడు జగదీష్. కోతులారంలో ప్రాథమిక విద్య, ఉన్నత విద్యను సంస్థాన్ నారాయణపురం మండలం గుజ్జ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పూర్తిచేశారు. హైదరాబాద్‌లో పాలిటెక్నికల్, బీటెక్ పూర్తి చేశారు. ఎంటెక్, ఐఐటీ చెన్నైలో చదివారు. 'ప్రయోగాత్మక మరియు సంఖ్యా విధానమైన కావిటేటింగ్ ఫ్లో ప్లాస్ట్ యాక్సిసిమెట్రిక్ బాడీ' అనే అంశంపై ఇటీవల పీహెచ్‌డీ పూర్తి చేసి ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్లు ఉషశ్రీ, టి.రవీందర్ రెడ్డి చేతుల మీదుగా పట్టా పొందారు.

27న బీఆర్‌ఎస్ నల్లగొండ నియోజకవర్గ సమావేశం

నల్లగొండ టూటౌన్: పట్టణంలోని లక్ష్మీ గార్డెన్‌లో ఈ నెల 27వ తేదీన బీఆర్‌ఎస్ పార్టీ నల్లగొండ నియోజకవర్గ సమావేశం నిర్వహించనున్నట్లు పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పార్లమెంట్ ఎన్నికలను పురస్కరించుకుని నిర్వహించనున్న ఈ సమావేశానికి పార్టీ ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులు, బూత్‌స్థాయి నాయకులు హాజరు కావాలని కోరారు.

'బీజేపీ మత రాజకీయాలను తిప్పి కొట్టాలి'

చండూరు: దేశంలో బీజేపీ అవలంబిస్తున్న మత రాజకీయాలను తిప్పికొట్టాలని సీపీఐ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం అన్నారు. గురువారం చండూరు పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో జరిగిన సీపీఐ మునుగోడు నియోజకవర్గ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. నలపరాజు రామలింగయ్య అధ్యక్షత జరిగిన ఈ సమావేశంలో జిల్లా కార్యవర్గ సభ్యులు ఆర్.అంజయ్య చారి, బచ్చనగోని గాలయ్య, టి.వెంకటేశ్వర్లు, జి.రామచంద్రం, మండల కార్యదర్శులు నలపరాజు సతీష్, చాపల శ్రీను, భిక్షంరెడ్డి, రమేష్, శేఖర్ రెడ్డి, బూడిద సురేష్ తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

నల్లగొండ టూటౌన్: బేకరీ నిర్వాహకులు ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తూనికలు కొలతల జిల్లా అధికారి పి.రామకృష్ణ హెచ్చరించారు. గురువారం నల్లగొండ పట్టణం రామగిరిలోని పలు బేకరీలను ఆకస్మిక తనిఖీ చేశారు. బేకరీలలోని బ్రెడ్ ప్యాకెట్లను పరిశీలించారు. హాయ్ అఫ్లేట్ ప్యాకెట్లపై మ్యానుఫ్యాక్చరింగ్, చిరునామా, తేదీ తదితర వివరాలు లేకపోవడాన్ని గమనించారు. ఆయా దుకాణాలకు బ్రెడ్ ప్యాకెట్లు సరఫరా చేస్తున్న కంపెనీల వివరాలు సేకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి బేకరీ నిర్వాహకుడు ప్రభుత్వ నిబంధనలు పాటించాలని, తూకాల విషయంలో వినియోగదారులను మోసం చేయొద్దన్నారు.

28న యూటీఎఫ్ సమావేశం

రామగిరి (నల్లగొండ): ఈ నెల 28న శాలిగౌరారంలో జరిగే టీఎస్ యూటీఎఫ్ జిల్లా కమిటీ సమావేశాలను విజయవంతం చేయాలని టీఎస్ యూటీఎఫ్ సాంఘిక సంక్షేమ గురుకుల ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సి.శౌరీర్ అన్నారు. కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను గురువారం తిప్పర్తిలో ఆవిష్కరించి మాట్లాడారు. తిప్పర్తి మండల అధ్యక్షులు కె.రమణ, కోశాధికారి బి.శేఖర్, కార్యదర్శులు బి.వెంకన్న పాల్గొన్నారు.

మునుగోడు: శాలిగౌరారం లో నిర్వహించే టీఎస్ యూటీఎఫ్ సమావేశాన్ని విజయవంతం చేయాలని ఆ సంఘం జిల్లా కార్యదర్శి గేర నర్సింహ కోరారు. గురువారం సమావేశ పోస్టర్‌ను మునుగోడులో ఉపాధ్యాయులతో కలిసి విడుదల చేసి మాట్లాడారు. మునుగోడు కాంప్లెక్స్ హెచ్‌ఎం రవీందర్ పాల్గొన్నారు.

చండూరు : శాలిగౌరారంలో జరిగే జిల్లా కమిటీ సమావేశాన్ని జయప్రదం చేయాలని టీఎస్ యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి రామలింగయ్య పిలుపునిచ్చారు. ఆహ్వాన పత్రికను బంగారుగడ్డ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆయన ఆవిష్కరించి మాట్లాడారు.

పట్టపగలే విద్యుత్ వెలుగులు

- పర్యవేక్షణ లేకపోవడంతో విద్యుత్ వృథా
- మున్సిపాలిటీ, పంచాయతీలకు రూ.వేలల్లో బిల్లులు
- నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న సిబ్బంది


చిట్యాలలో పట్టపగలు వెలుగుతున్న స్ట్రీట్ లైట్

చిట్యాల: పట్టపగలే వీధిలైట్లు వెలుగుతున్నా పట్టించుకునేవారు లేకపోవడంతో విద్యుత్ వృథా అవుతోంది. దీంతో మున్సిపాలిటీ, గ్రామ పంచాయతీలు లక్షలాది రూపాయలను విద్యుత్ శాఖకు చెల్లించాల్సి వస్తోంది. చిట్యాల మున్సిపాలిటీలోని పలు వార్డుల్లో నిరంతరాయంగా వీధి లైట్లు వెలుగుతున్నాయి. కొన్ని స్తంభాలకు ఆన్ ఆఫ్ స్విచ్‌లు ఉన్నప్పటికీ తగిన పర్యవేక్షణ లేకపోవడంతో పట్టపగలే లైట్లు వెలుగుతున్నాయి. దీంతో విలువైన విద్యుత్ వృథా కావడంతోపాటు మున్సిపాలిటీకి విద్యుత్ బిల్లుల ఖర్చు అదనపు భారంగా మారుతోంది.

నిరంతరాయంగా వీధిలైట్ల వెలుగులు

చిట్యాల మండలంలోని 18 గ్రామ పంచాయతీల్లో ప్రతి గ్రామంలో యాభై నుంచి నూటయాభైకి పైగా వీధి లైట్లు ఉంటాయి. వీటిలో చాలావాటికి ఆన్ ఆఫ్ స్విచ్ బోర్డులు లేవు. ఉన్నవాటికి పర్యవేక్షణ లేక నిరంతరాయంగా లైట్లు వెలుగుతున్నాయి. కొన్ని గ్రామాల్లో సరైన సిబ్బంది లేకపోవడంతో విద్యుత్ సమస్యలు వచ్చినప్పుడు మరమ్మతులు చేసేవారు లేక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. సరాసరి రోజుకు పదమూడు గంటలు మాత్రమే వెలగాల్సిన వీధి లైట్లు ఇరవై నాలుగు గంటలపాటు వెలుగుతున్నాయి. ఈ లైట్స్ 20 వాట్స్ కెపాసిటీ నుంచి 50 వాట్స్ కెపాసిటీ వరకు ఉంటాయి. రాత్రి సమయాల్లో మినహాయిస్తే అదనంగా పది గంటలకుపైగా పగటి పూట వీధిలైట్లు వెలుగుతుండడంతో వందలాది యూనిట్ల విద్యుత్ వాడకం అనవసరంగా జరుగుతోంది. దీంతో ప్రతి గ్రామ పంచాయతీకి ఏడాదికి లక్షలాది రూపాయల అదనపు భారం పడుతోంది. గ్రామ పంచాయతీల అభివృద్ధికి ప్రత్యేక నిధులు మంజూరైనప్పుడు ఆ నిధుల్లోంచి విద్యుత్ బకాయిలు చెల్లించాల్సి ఉంటుంది.

మూడేళ్ల పాటు నిర్వహణ చేపట్టాల్సి ఉన్నా..

చిట్యాల మండలంలోని వట్టిమర్తి, ఉరుమడ్ల, ఎలికట్టె, నేరడ, వనిపాకల గ్రామాలతోపాటు మరో నాలుగు గ్రామాల్లో పంచాయతీరాజ్ శాఖ పర్యవేక్షణలో ఎనర్జీ ఎఫిషియన్సీ సర్వీస్ లిమిటెడ్ సంస్థ ఆధ్వర్యంలో వీధిలైట్లను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. వాటి నిర్వహణ మూడేళ్ల పాటు ఆ సంస్థ చేపట్టాల్సి ఉంది. ఆరు నెలల అనంతరం సంస్థ నిర్వాహకులు వీధిలైట్ల నిర్వహణ పట్టించుకోకపోగా కాలిపోయిన లైట్స్‌ను సైతం మార్చలేదు. దీంతో వీధిలైట్స్ నిర్వహణ తిరిగి గ్రామ పంచాయతీలపై పడింది. ఒక్కో స్ట్రీట్ లైట్‌కు వేలాది రూపాయలు కేటాయించినప్పటికీ అవి నిరుపయోగంగా మారాయని సర్పంచ్‌లు వాపోతున్నారు. గతంలో బాగా ఉన్న లైట్లను తొలగించి ఈ లైట్స్‌ను ఏర్పాటు చేసినప్పటికీ అవి నాణ్యతగా లేకపోవడంతో ఆరు నెలలకే కాలిపోయాయని పేర్కొంటున్నారు. వీధిలైట్లు నిరంతరాయంగా వెలుగకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు సంబంధిత అధికారులను, ప్రజాప్రతినిధులను కోరుతున్నారు.

విద్యుత్ వృథా అరికట్టాలి



చిట్యాల మున్సిపాలిటీలోని ఒకటో వార్డు(శివనేనిగూడెం)తోపాటు ప్రతి గ్రామంలో వీధిలైట్లు ఇరవై నాలుగు గంటలు వెలుగుతున్నాయి. వీటి నిర్వహణ పట్ల విద్యుత్‌శాఖ అధికారులు, పాలక వర్గాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయి. సంబంధిత శాఖ అధికారులు తగిన చర్యలు తీసుకుని వీధిలైట్లు నిరంతరం వెలగడాన్ని నియంత్రించాలి. గ్రామస్తులు కూడా బాధ్యతగా ఆన్ ఆఫ్ స్విచ్‌లు ఉన్న వీధిలైట్లకు పగటి పూట విద్యుత్ సరఫరా నిలిపివేయాలి.

–గుండాల నరేష్‌గౌడ్, ఒకటో వార్డు, చిట్యాల మున్సిపాలిటీ

మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం

- నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం


పేరేపల్లిలో సీసీ రోడ్ల పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే వేముల వీరేశం

చిట్యాల: గ్రామాల్లో ప్రజల అవసరాలకు అనుగుణంగా మౌలిక వసతుల కల్పనకు మొదటి ప్రాధాన్యత ఇస్తున్నట్లు నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం తెలిపారు. చిట్యాల మండలం పేరేపల్లి గ్రామంలో పది లక్షల రూపాయలతో సీసీ రోడ్ల పనులకు, బొంగోనిచెర్వు గ్రామంలో పది లక్షల రూపాయలతో చేపట్టనున్న డ్రైయినేజీ పనులు, గ్రామ పంచాయతీ భవన నిర్మాణ పనులకు గురువారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుద్ధ్య పనులకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఎంపీడీఓ బి.లాజర్, సర్పంచ్‌లు అంతటి వెంకటేష్‌గౌడ్, సామిడి మోహన్‌రెడ్డి, జనగాం రవీందర్‌గౌడ్, ఎంపీటీసీ దేవరపల్లి సత్తిరెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ కాటం వెంకటేశం, పీఏసీఎస్ మాజీ చైర్మన్లు పిశాటి భీష్మారెడ్డి, నర్రా మోహన్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గుడిపాటి లక్ష్మీనర్సింహ, నాయకులు బట్టు అయిలేష్, ఆవుల యాదయ్య, గోలి గణేశ్, దుబ్బ కుమార్, రుద్రారపు శ్రీను పాల్గొన్నారు.

రైతుల సంక్షేమానికి కృషి చేయాలి

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను రైతులందరికీ అందేలా పీఏసీఎస్ పాలక మండలి కృషి చేయాలని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. చిట్యాల మండలం వెలిమినేడు గ్రామ పీఏసీఎస్ చైర్మన్ ఏనుగు రఘుమారెడ్డి ప్రమాణ స్వీకార కార్యక్రమానికి గురువారం ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వెలిమినేడు గ్రామాన్ని నూతన మండలంగా ఏర్పాటు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వానికి, రెవెన్యూ మంత్రికి ప్రాతిపాదనలు చేసినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డీసీఓ కిరణ్‌కుమార్, సర్పంచ్ దేశబోయిన మల్లమ్మపాపయ్య, పీఏసీఎస్ వైస్ చైర్మన్ బొంతల అంజిరెడ్డి, మాజీ చైర్మన్‌లు పిశాటి భీష్మారెడ్డి, నర్రా మోహన్‌రెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ కాటం వెంకటేశం, కంచర్ల వెంకట్‌రెడ్డి, కొంపెల్లి వెంకట్‌రెడ్డి, చీమల వీరేశం, అంశల సత్యనారాయణ, బట్టు అయిలేష్, గుడిపాటి లక్ష్మీనర్సింహ, సాగర్ల గోవర్ధన్ పాల్గొన్నారు.

సమాజంలో లింగ వివక్ష రూపుమాపాలి


కేతేపల్లి: భీమారంలో ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థినులు


నార్కట్‌పల్లి: ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు

కేతేపల్లి: సమాజంలో లింగ వివక్షను రూపుమాపేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని భీమారం సర్పంచ్ బడుగుల శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. బాలికా దినోత్సవం సందర్భంగా గురువారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో మండలంలోని భీమారం గ్రామంలో నిర్వహించిన బేటీ బచావో–బేటీ పడావో కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అనంతరం పాఠశాల విద్యార్థినులతో ఐసీడీఎస్ సిబ్బంది ప్రతిజ్ఞ చేయించారు. జెడ్పీ పాఠశాల హెచ్‌ఎం భిక్షమయ్య, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కళావతి, ఏఎన్‌ఎం హైమావతి, అంగన్‌వాడీ టీచర్లు ఆరుణ, బేబి, కాంతమ్మ తదితరులు పాల్గొన్నారు.

నార్కట్‌పల్లి: జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా మండలంలోని అక్కెనపల్లి, శాపల్లి గ్రామాల అంగన్‌వాడీ కేంద్రాల ఆధ్వర్యంలో పాఠశాల విద్యార్థులతో ర్యాలీలు నిర్వహించి ప్రతిజ్ఞ చేయించారు. అంగన్‌వాడీ టీచర్లు పద్మ, ప్రభావతి, కరుణ, లలిత, అనిత, హైమ పాల్గొన్నారు.

కమలాద్రి శ్రీ లక్ష్మీనరసింహస్వామి కల్యాణం


మంగళసూత్రాన్ని చూపిస్తున్న అర్చకులు

నార్కట్‌పల్లి : శాపల్లి గ్రామంలో గల కమలాద్రి శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం స్వామి అమ్మవార్ల కల్యాణాన్ని ఆలయ అనువంశిక అర్చకులు కారంపూడి నరసింహాచార్యులు, రాకేష్ చార్యులు, అర్చకులు హరికుప్పల విష్ణు, శ్రీనివాసచార్యులు, అరుణ్‌చార్యుల బృందం వైభవంగా నిర్వహించారు. ముందుగా స్వామి, అమ్మవార్ల ఎదుర్కోలు కార్యక్రమాన్ని భక్తుల భజనలు, మహిళల కోలాటం, మంగళవాయిద్యాల మధ్య నిర్వహించారు. అనంతరం కల్యాణ వేదిక వద్దకు ఉత్సవమూర్తులను తీసుకొచ్చారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై కల్యాణాన్ని తిలకించారు. గ్రామానికి చెందిన సిరిగిరెడ్డి వెంకట్‌రెడ్డి, పిల్లి జాని, కుందూరు నర్సిరెడ్డి, ఉడతల చిన్న వెంకన్న, కృష్ణయ్య, కన్నెబోయిన స్వామి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం, మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య వేర్వేరుగా పాల్గొని కల్యాణం తిలకించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సూదిరెడ్డి నరేందర్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రేగట్టె మల్లికార్జున్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బత్తుల ఉషయ్య, సర్పంచ్ కర్నాటి ఉపేందర్, మాజీ సర్పంచ్‌లు సిద్దగోని స్వామి, నిమ్మనగోటి లింగయ్య, మాజీ ఉప సర్పంచ్ నిమ్మనగోటి వెంకటేశ్వర్లు, గోలి సాగర్‌రెడ్డి, జాల ముకుందం, పరమేష్, ప్రవీణ్, విజయ్, పజ్జూరి వెంకట్‌రెడ్డి, కర్నాటి నర్సయ్య నోముల విష్ణు, రాజశేఖర్‌రెడ్డి, శ్రవణ్, శివరామ్, సతీష్, నాగరాజు, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కమిషనర్‌కు వినతి

చండూరు: బహిరంగ వేలంలో దక్కించుకున్న మున్సిపాలిటీకి చెందిన 8వ నంబర్ షాపును తనకు వెంటనే అప్పగించాలని కోరుతూ కొంఢ్రెడ్డి శోభ గురువారం మున్సిపల్ కమిషనర్ వెంకటమణికరణ్‌కు వినతి పత్రం అందజేశారు. గత ఏడాది ఫిబ్రవరి 23న చండూరు మున్సిపల్ అధికారులు నిర్వహించిన వేలంలో మున్సిపాలిటీకి చెందిన 8వ నంబర్ మడిగెను లీజుకు దక్కించుకున్నానని తెలిపారు. కానీ అధికారులు మాత్రం గత లీజుదారుడిని ఖాళీ చేయించకుండా తనకు అగ్రిమెంట్ చేయడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని వివరించారు. రూ.50 వేలు కూడా చెల్లించినట్లు పేర్కొన్నారు.

అక్రమ నిర్మాణాలు తొలగించాలని వినతి


వినతి పత్రం అందజేస్తున్న గ్రామస్తులు

నార్కట్‌పల్లి: మండల కేంద్రంలోని కూరగాయల అంగడి స్థలంలో అక్రమ నిర్మాణాలను తొలగించి ఆ భూమిని ప్రజా అవసరాలకు ఉపయోగించాలని కోరుతూ నార్కట్‌పల్లి పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో గురువారం పంచాయతీ కార్యదర్శి సుభాయోద్దీన్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా నార్కట్‌పల్లి పరిరక్షణ సమితి నాయకులు, వార్డు సభ్యులు మాట్లాడుతూ 2023 జూన్ నెలలో గ్రామ పంచాయతీ పాలకవర్గం అక్రమ నిర్మాణాలను తొలగించాలని తీర్మానం చేసినా నేటికీ చర్యలు తీసుకోవడంతో అధికారులు విఫలమవుతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో మేడబోయిన శ్రీనివాస్, కన్నెబోయిన నర్సింహ, నడింపల్లి శ్రవణ్, వడ్డెగోని రామలింగయ్య, నడింపల్లి రమేష్, గుడూరు అంజిరెడ్డి, రమేష్, పాల్గొన్నారు.

వివాదాస్పద స్థలంలో 144 సెక్షన్ అమలు

నార్కట్‌పల్లి మండల కేంద్రంలో కొన్నేళ్లుగా కూరగాయల సంత కొనసాగుతున్న స్థలం సమీపంలో మసీదు ఉండటంతో ఆ స్థలం వివాదం కోర్టులో కొనసాగుతోంది. అయితే ఈ నెల 22న అయోధ్యలో రామమందిరం ప్రారంభోత్సవం సందర్భంగా కూరగాయల సంత స్థలంలో అన్నదానం చేయాలని గ్రామస్తులు నిర్ణయించుకోగా సమీపంలో మసీదు ఉండడంతో పోలీసులు అనుమతి నిరాకరించారు. దీంతో గ్రామస్తులు గోపలాయపల్లి వారిజాల వేణుగోపాలస్వామి దేవాలయ ఆవరణలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఆ రోజు నుంచి కూరగాయల సంత స్థలంలో పోలీసులు పికెటింగ్ ఏర్పాటు చేయగా.. ఆ స్థలం వరకు 144 సెక్షన్ అమలు చేస్తున్నట్లు తహసీల్దార్ పద్మ గురువారం రాత్రి ఫ్లెక్సీ ఏర్పాటు చేయించారు. అయితే శుక్రవారం నిర్వహించే సంత యథావిధిగా కొనసాగనున్నట్లు తహసీల్దార్ తెలిపారు.

రైతు ఉత్పత్తిదారుల కంపెనీ లిమిటెడ్ పరిశీలన

కట్టంగూర్ : మండలంలోని అయిటిపాముల జీపీ పరిధి గంగదేవిగూడెం సమీపంలో ఉన్న కట్టంగూర్ రైతు ఉత్పత్తి దారుల కంపెనీ లిమిటెడ్‌ను గురువారం మహబూబ్‌నగర్, మెదక్ జిల్లాలకు చెందిన వెల్దుర్తి, టేక్‌మల్, దేవకద్ర, మిడ్జిల్, బాలానగర్, పాలమూరు విజిటబుల్ ఎఫ్‌ఓల రైతు ప్రతినిధులు పరిశీలించారు. ఎరువులు, నిమ్మ ఒరుగుల మిషన్, నిమ్మ గ్రేడింగ్, కోల్డ్ స్టోరేజీ, వ్యవసాయ పనిముట్లను పరిశీలించారు. వ్యాపారం విధానం, లాభ నష్టాలు ట్రాన్స్‌పోర్ట్‌ల అంశాలపై ప్రతినిధులకు నల్లగొండ మాజీ ఎమ్మెల్యే నంద్యాల నర్సింహారెడ్డి, ఎఫ్‌పీఓ చైర్మన్ సైదమ్మ వివరించారు. ఈ కార్యక్రమంలో నకిరేకల్ హార్టికల్చర్ అధికారి విద్యాసాగర్, ఎఫ్‌పీఓ డైరెక్టర్‌లు ఉన్నారు.

యూనివర్సిటీ భూములు హైకోర్టుకు కేటాయించొద్దు

నల్లగొండ టూటౌన్: వ్యవసాయ యూనివర్సిటీ భూములను హైకోర్టుకు కేటాయించొద్దని, జీవో 55ను వెనక్కి తీసుకోవాలని ఏబీవీపీ జిల్లా నాయకుడు ఆవుల సంపత్‌కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం నల్లగొండలోని ఏబీవీపీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ఏబీవీపీ మహిళా నాయకురాలు ఝాన్సీపై దాడి చేసిన పోలీసులను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. నగర కార్యదర్శి నాంపల్లి మధు, బండారి వేణు, సత్య పాల్గొన్నారు.

రోడ్డు భద్రతపై అవగాహన

చిట్యాల: రోడ్డు భద్రత, ట్రాఫిక్ నిబంధనలపై ప్రతిఒక్కరు అవగాహన కలిగి ఉండి, నిబంధనలు పాటించాలని చిట్యాల ఎస్‌ఐ ఇరుగు రవి అన్నారు. చిట్యాల పట్టణంలోని గ్రీన్ గ్రోవ్ స్కూల్ ఆధ్వర్యంలో గురువారం రోడ్డు భద్రతపై విద్యార్థులు నిర్వహించిన ర్యాలీలో ఆయన పాల్గొని మాట్లాడారు. స్కూల్ చైర్మన్ బండి వీణా అనిల్‌కుమార్‌రెడ్డి, డైరెక్టర్ జూలకంటి వేణుగోపాల్‌రెడ్డి, ఏఓ పోలా గోవర్ధన్, పీఈటీ రాము, ఉపాధ్యాయులు బాలగోని లింగయ్య, రంగినేని అనిత, మహమ్మద్ ఫరీద్, చంద్రశేఖర్, ఉమారాజు, మధు పాల్గొన్నారు.

మాజీ వార్డు సభ్యుడు మృతి

చిట్యాల: స్థానిక మాజీ వార్డు సభ్యుడు పాల ఊషయ్య(63) అనారోగ్యంతో గురువారం మృతి చెందాడు. ఆయన మృతదేహాన్ని చిట్యాల మాజీ సర్పంచ్ జిట్ట నగేష్, డీసీసీ కార్యదర్శి పోకల దేవదాసుల, బోడ శ్రీను, కుక్కల చంద్రయ్య, జిట్ట రమేష్, స్వామి, కిషన్, నర్సింహ, యాదయ్య, ముత్యాలు సందర్శించి నివాళులర్పించారు.

కుర్చీలు అందజేత

మునుగోడు: మండల కేంద్రంలోని ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయానికి కొంపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు వెదిరె మేఘారెడ్డి తన సొంత డబ్బులతో కొనుగోలు చేసిన 175 కుర్చీలను గురువారం అందజేశారు. ప్రతినెలా జరిగే ప్రాజెక్టు సమావేశాలకు హాజరయ్యే అంగన్‌వాడీ టీచర్లు కూర్చునేందుకు కుర్చీలు లేకపోవడంతో మేఘారెడ్డి రూ.60వేలు ఖర్చుచేసి కుర్చీలు అందజేసినట్లు సీడీపీఓ కవిత తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ఎం.నరేందర్, కొంపల్లి సర్పంచ్ జాల వెంకన్న యాదవ్, డిప్యూటీ తహసీల్దార్ ఎస్.నరేష్, ఎంపీఓ సుమలత పాల్గొన్నారు.


కుర్చీలు అందజేస్తున్న మేఘారెడ్డి

ఘనంగా జాతీయ ఓటరు దినోత్సవం


నకిరేకల్: ప్రతిజ్ఞ చేస్తున్న ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు



చండూరు : ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు, ఆర్డీఓ దామోదర్‌రావు


నార్కట్‌పల్లి : ఓటర్లతో ప్రతిజ్ఞ చేయిస్తున్న అధికారులు, సిబ్బంది


మునుగోడు : వృద్ధ దంపతులను సన్మానిస్తున్న రెవెన్యూ అధికారులు

చండూరు: పద్దెనమిది సంవత్సరాలు నిండిన యువతీ యువకులు ఓటు నమోదు చేసుకోవాలని చండూరు రెవెన్యూ డివిజన్ అధికారి దామోదర్‌రావు పిలుపునిచ్చారు. 14వ జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా చండూరు పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ భారత రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలన్నారు. తహసీల్దార్ రవీందర్‌రెడ్డి, సీఐ వెంకటయ్య, ఎస్‌ఐ సురేష్, ఎలక్షన్ డిప్యూటీ తహసీల్దార్ దీపక్, డిప్యూటీ తహసీల్దార్ ప్రసాద్, సీనియర్ అసిస్టెంట్ తదితరులు పాల్గొన్నారు.

మునుగోడు: ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ ఎం.నరేందర్ అన్నారు. జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం మునుగోడు జిల్లా పరిషత్ పాఠశాలలో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. అనంతరం మానవహారం నిర్వహించి ప్రతిజ్ఞ చేశారు. అదేవిధంగా నూతన ఓటర్లకు తహసీల్దార్ ఓటరు కార్డులు అందజేసి వృద్ధ ఓటర్లను శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ ఎస్.నరేష్, సీడీపీఓ కవిత, ఎంపీఓ సుమలత, ఆర్‌ఐ నాగరాజు, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

ఓటు వజ్రాయుధం

మర్రిగూడ: ఓటు హక్కు వజ్రాయుధం లాంటిదని తహసీల్దార్ బక్క శ్రీనివాసులు అన్నారు. గురువారం జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా స్థానిక బస్టాండ్ నుంచి చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం మానవహారంగా ఏర్పడి ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ దేశ భవిష్యత్ ఓటరు పైనే ఆధారపడి ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ జె.వెంకటేశ్వర్‌రావు, డీటీ జూటూరు తారకరామన్, సర్పంచ్ నల్ల యాదయ్య, ఏపీఓ గుంటుక వెంకటేశం, ఆర్‌ఐ బషీర్‌అలీ, ఎంపీఓ యూసుఫ్, హైస్కూల్ హెచ్‌ఎం నీరుడు అంజయ్య, నూన్సావత్ బిచ్చు నాయక్, పందుల రాములుగౌడ్, చెరుకు శ్రీరాములు, వెంకటంపేట బాలయ్య, దామెర సత్తయ్య, యూసుఫ్, మధు తదితరులు పాల్గొన్నారు.

ఓటు హక్కు వినియోగించుకోవాలి

నకిరేకల్ : జాతీయ ఓటరు దినోత్సవాన్ని గురువారం నకిరేకల్‌లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జరుపుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులతో అధ్యాపకులు ప్రతిజ్ఞ చేయించారు. కళాశాల ప్రిన్సిపాల్ కె.చంద్రశేఖర్, రాజనీతి శాస్త్ర విభాగం అధిపతి జి.మధుసూదన్‌రెడ్డి, అధ్యాపకులు హరిత, శంకర్, సురేందర్, నర్సింహాచారి, జానయ్య, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా పాలెం ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. హెచ్‌ఎం వంటల వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయుడు నర్సింహమూర్తి పాల్గొన్నారు.

ఓటర్లతో ప్రతిజ్ఞ

నార్కట్‌పల్లి : జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో గురువారం అధికారులు, ప్రజాప్రతినిధులు ఓటర్లతో ప్రతిజ్ఞ చేయించారు. పాఠశాలల్లో క్రీడా పోటీలు నిర్వహించారు. తహసీల్దార్ పద్మ, ఎంపీడీఓ యాదగిరి, సర్పంచ్ దూదిమెట్ల స్రవంతి, డిప్యూటీ తహసీల్దార్ అజాంఖాన్, ఆర్‌ఐ తరుణ్, సీనియర్ అసిస్టెంట్ విజయ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యంలో ఓటు వజ్రాయుధం

కట్టంగూర్ : ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు వజ్రాయుధం లాంటిదని తహసీల్దార్ డి స్వప్న అన్నారు. జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా గురువారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో సిబ్బంది ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన యువతీయువకులు ఓటు హక్కుకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. అదేవిధంగా మండల కేంద్రంలో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. స్థానిక హైస్కూల్, పలు గ్రామాల్లో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించి గెలుపొందినవారికి బహుమతులు అందజేశారు. ఆర్‌ఐ కుమార్‌రెడ్డి, డీటీ సుకన్య, సిబ్బంది, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

18 ఏళ్లు నిండిన ప్రతీ ఒక్కరూ ఓటుహక్కు పొందాలి

శాలిగౌరారం: పద్దెనిమిదేళ్లు నిండిన యువతీయువకులు విధిగా దరఖాస్తు చేసుకొని ఓటుహక్కు పొందాలని తహసీల్దార్ పాల్‌సింగ్ అన్నారు. జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలో విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక అంబేద్కర్ చౌరస్తావద్ద ప్రజలనుద్దేశించి మాట్లాడారు. ఎంపీడీఓ లక్ష్మయ్య, డిప్యూటీ తహసీల్దార్ సత్తార్, ఏపీఓ జంగమ్మ, ఏపీఎం జానకి, గీతాంజలి ఉన్నత పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


మర్రిగూడ : ఓటర్లతో ప్రతిజ్ఞ చేయిస్తున్న తహసీల్దార్ శ్రీనివాసులు


కట్టంగూర్ : ముగ్గుల పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేస్తున్న తహసీల్దార్


శాలిగౌరారం: ఓటుహక్కుపై అవగాహన కల్పిస్తున్న తహసీల్దార్ పాల్‌సింగ్

సౌర విద్యుత్ యూనిట్లను సద్వినియోగం చేసుకోవాలి


సౌర విద్యుత్ యూనిట్‌ను పరిశీలిస్తున్న డీఆర్‌డీఓ కాళిందిని

కేతేపల్లి: స్త్రీనిధి ద్వారా మహిళా స్వయం సహాయక సంఘాలకు సబ్సిడీపై ప్రభుత్వం అందించే సౌర విద్యుత్ యూనిట్లను సద్వినియోగం చేసుకోవాలని డీఆర్‌డీఓ కాళిందిని కోరారు. కేతేపల్లి మండలంలోని చెర్కుపల్లిలో పీఏసీఎస్ వైస్ చైర్మన్ గార్లపాటి సుధీర్‌రెడ్డి ఇంటిపై ఏర్పాటు చేసిన సౌర విద్యుత్ యూనిట్‌ను గురువారం ఆమె పరిశీలించి మాట్లాడారు. సబ్సిడీపై ఇచ్చే సౌర యూనిట్లు 25 ఏళ్ల పాటు మన్నికగా ఉంటాయని తెలిపారు. దీంతో తక్కువ ఖర్చుతో గృహ అవసరాలకు కరెంట్‌ను వినియోగించుకోవచ్చన్నారు. సర్పంచ్ చినబొస్క ప్రసాద్, శ్రీనిధి ఆర్‌ఎం శ్రీలేఖ, డీపీఎం అరుణ్‌కుమార్, రామలింగం, ఏపీఎం బి.యాదమ్మ, సీసీ ప్రసాద్, పంచాయతీ కార్యదర్శి లక్ష్మీనారాయణ, ఎఫ్ఏ జెబునిసా బేగం పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

చండూరు : పీఆర్‌టీయూ తెలంగాణ చండూరు మండల శాఖ ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను గురువారం ఆర్డీఓ దామోదర్‌రావు, తహసీల్దారు రవీందర్‌రెడ్డి, సీఐ వెంకటయ్య, ఎస్‌ఐ సురేష్‌లు చండూరు మున్సిపాలిటీ కేంద్రంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి యాదయ్య, గౌరవ అధ్యక్షుడు మధుమోహన్, బొడ్డు శీనయ్య, కోట సరిత, ఎఫ్ఎల్ఎన్ నోడల్ అధికారి ఎడ్ల భిక్షం, కొప్పుల యాదయ్య, సైదులు, లియాకత్ అలీ తదితరులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

సూర్యాపేట కలెక్టర్‌కు రాష్ట్రస్థాయి అవార్డు



సూర్యాపేట కలెక్టర్ వెంకట్రావుకు అవార్డు అందజేస్తున్న గవర్నర్ తమిళిసై

దురాజ్‌పల్లి (సూర్యాపేట) : బెస్ట్ ఎలక్టోరల్ ప్రాక్టీసెస్ –2024 స్టేట్ అవార్డును జిల్లా కలెక్టర్ ఎస్. వెంకట్రావు అందుకున్నారు. ఎన్నికల నిర్వహణలో విశేష కృషి చేసిన అధికారులను రాష్ట్ర ఎన్నికల సంఘం గుర్తించి గౌరవించే బెస్ట్ ఎలక్టోరల్ ప్రాక్టీసెస్ –2024 స్టేట్ అవార్డుకు కలెక్టర్ ఎంపికైనా విషయం విదితమే. గురువారం హైదరాబాద్‌లో నిర్వహించిన జాతీయ ఓటర్ల దినోత్సవం కార్యక్రమంలో రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ చేతుల మీదుగా ఈ అవార్డు స్వీకరించారు. అవార్డు అందుకున్న కలెక్టర్‌ను గురువారం మధ్యాహ్నం జిల్లా కలెక్టరేట్‌లో పలువురు అధికారులు సన్మానించారు.

ఫిబ్రవరి 19 నుంచి పూర్వగిరీశుడి బ్రహ్మోత్సవాలు

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహా స్వామి వారి క్షేత్రానికి అనుబంధంగా కొనసాగుతున్న శ్రీ పూర్వగిరి లక్ష్మీనరసింహస్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలను ఫిబ్రవరి 19వ తేదీ నుంచి 25వ తేదీ వరకు నిర్వహించనున్నారు. 19వ తేదీన స్వస్తి వాచనంతో ఉత్సవాలకు ఆచార్యులు శ్రీకారం చుట్టి.. 25వ తేదీన అష్టోత్తర శతఘటాభిషేకంతో ముగించనున్నారు. 21న శ్రీస్వామి వారి ఎదుర్కోలు మహోత్సవం, 22న తిరు కల్యాణోత్సవం, 23న దివ్య విమాన రథోత్సవం కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఇక ఫిబ్రవరి 15వ తేదీ నుంచి 18వ తేదీ వరకు అధ్యయనోత్సవాలు నిర్వహించనున్నారు. నాలుగు రోజుల పాటు తిరుమంజనాలు, పురపాట్ సేవలను ఆచార్యులు ఆలయంలో జరిపిస్తారు.

బాలల కథల బండి పుస్తకానికి పురస్కారం


బాలల కథల బండి పుస్తక సంపాదకులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

చిట్యాల: ఉమ్మడి జిల్లా విద్యార్థులు 2022లో వెలువరించిన బాలల కథల బండి పుస్తకం డాక్టర్ చింతోజు బ్రహ్మయ్య–బాలమణి పురస్కారానికి ఎంపికవ్వడంతో ఆ పుస్తక సంపాదకులు పెరుమాళ్ల ఆనంద్, పొట్టబత్తుల రామకృష్ణ హర్షం వ్యక్తం చేశారు. చిట్యాల మండలం వట్టిమర్తి గ్రామంలోని జెడ్పీహెచ్‌ఎస్‌లో పనిచేస్తున్న పుస్తక సంపాదకులు ఆనంద్, రామకృష్ణను గురువారం పాఠశాల హెచ్‌ఎం పందిరి రమేష్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు అభినందించారు. ఈ సందర్భంగా పుస్తక సంపాదకులు మాట్లాడుతూ.. ఉమ్మడి జిల్లాలోని పిల్లల్లో సృజనాత్మక, సాహిత్య ప్రక్రియలను పెంపొందించేందుకు కథలు రాయించి పుస్తకంగా వెలువరించామని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు అరుణకుమారి, యాదయ్య, సూర్యప్రకాష్, నర్సింహ, నీరజ, రాజు, మధుసూదన్, జయశ్రీ, విద్యార్థులు భవ్య, శరణ్య, భార్గవి పాల్గొన్నారు.

ఫిబ్రవరి 15న సకల కళల సమ్మేళనం


సీఎం రేవంత్‌రెడ్డితో నటరాజ్ అకాడమీ వ్యవస్థాపకుడు నల్ల గిరి

మోత్కూరు: హైదరాబాద్‌లోని లలిత కళాతోరణంలో ఫిబ్రవరి 15న మూడు వేల మంది కళాకారులతో సకల కళల సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు మోత్కూరు మండలం అనాజిపురం గ్రామానికి చెందిన నటరాజ్ అకాడమీ వ్యవస్థాపకుడు నల్ల గిరి గురువారం తెలిపారు. హైదరాబాద్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసి ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరు కావాలని కోరగా.. ఆయన అందుకు అంగీకరించారని అన్నారు. కనుమరుగవుతున్న జానపద కళలను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని పేర్కొన్నారు. చిందు యక్ష గానం, కాటిపాపలు, బుడగ జంగాలు, పెద్దమ్మలోళ్లు, బైండ్లవారు, శారదకాండ్రు, బుర్ర కథ, ఒగ్గు కథ, బుడబుక్కల వారు, గంగిరెద్దుల వారితో ఈ సమ్మేళనాన్ని నిర్వహిస్తామని చెప్పారు. ఎల్‌బీ స్టేడియం నుంచి రవీంద్ర భారతి మీదుగా లలిత కళాతోరణం వరకు తొలుత కళాకారులతో ప్రదర్శనలు నిర్వహిస్తామని తెలిపారు. ఉమ్మడి జిల్లాతో పాటు రాష్ట్ర నలుమూలల నుంచి ఆహ్వానించిన కళాకారులు ఈ సమ్మేళనంలో పాల్గొని తమ కళలను ప్రదర్శిస్తారని పేర్కొన్నారు.


జాన్‌పహాడ్ దర్గా వద్ద భక్తుల కోలాహలం


బాబా సమాధుల వద్ద దీపాలు వెలిగిస్తున్న మహిళలు, చిన్నారులు

జాన్‌పహాడ్ దర్గా ఉర్సు షురూ

గుసుల్ షరీఫ్‌తో ప్రారంభమైన ఉత్సవాలు

- బాబా సమాధుల వద్ద ప్రత్యేక ప్రార్థనలు
- నాగేంద్రుని పుట్ట వద్ద భక్తుల పూజలు
- నేడు గంధం ఊరేగింపు
- హాజరుకానున్న మంత్రి ఉత్తమ్

పాలకవీడు: మత సామరస్యానికి ప్రతీక అయిన పాలకవీడు మండలంలోని జాన్‌పహాడ్‌దర్గా ఉర్సు గురువారం గుసుల్ షరీఫ్‌తో వైభవంగా ప్రారంభమైంది. చాదర్ దట్టీలు, పూలమాలలతో 'హజ్రత్ సయ్యద్ మొహినుద్దీన్ షహీద్, హజ్రత్ సయ్యద్ జాన్‌పాక్ షాహిద్ రహ్మతుల్లా అలై' సమాధులను అలంకరించారు. దర్గా ముజావర్ అలీ ఇంటి నుంచి గంధాన్ని తీసుకువచ్చి సమాధులపై ఎక్కించి ఉత్సవాలను ప్రారంభించారు. దర్గాకు అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి మొక్కులు తీర్చుకోవడంతో పాటు, సమీపంలోని నాగేంద్రుని పుట్ట వద్ద ప్రత్యేక పూజలు చేశారు. విజయవాడకు చెందిన పకీరుల బృందం ఖవ్వాలీ నిర్వహించారు. శుక్రవారం నిర్వహించే గంధం ఊరేగింపునకు భక్తులు భారీగా తరలిరానుండడంతో హెల్త్, రెవెన్యూ, పంచాయతీరాజ్, ఎలక్ట్రిసిటీ, ఫైర్, ఆర్టీసీ, పోలీస్ వారు ప్రత్యేక శిబిరాలను ఏర్పాటు చేశారు. మూడు రోజుల పాటు కొనసాగనున్న ఉర్సుకు మిర్యాలగూడ, కోదాడ, సూర్యాపేట డిపోల నుంచి ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేశారు.


గంధం, దట్టీలు తరలిస్తున్న ముజావర్ జానీ

నేడు ప్రధాన ఘట్టం..

ఉర్సు ఉత్సవాల్లో భాగంగా వక్ఫ్‌బోర్డు ఆధ్వర్యంలో నిర్వహించే ప్రధాన ఘట్టం గంధం ఊరేగింపు. హైదరాబాద్ నుంచి తీసుకువచ్చిన పవిత్ర గంధాన్ని దర్గా సమీపంలోని చందల్‌ఖానాలో ఉంచుతారు. ప్రత్యేకంగా అలంకరించిన అశ్వంపై గంధాన్ని శుక్రవారం ఉదయం జాన్‌పహాడ్, చెరువుతండా, కల్మేట్‌తండా పుర వీధుల్లో ఊరేగించి తిరిగి ఒంటిగంటకు దర్గా వద్దకు చేర్చుతారు. అనంతరం బాబా సమాధులపై ఎక్కిస్తారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర భారీ నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి హాజరుకానున్నట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి. డీఎస్పీ ప్రకాష్, హుజూర్‌నగర్ సీఐ రాఘవరావు ఆధ్వర్యంలో 500 మంది పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయనున్నారు.

అధికారులు సమన్వయంతో పనిచేయాలి

మూడు రోజుల పాటు వైభవంగా జరిగే ఉర్సు ఉత్సవాల్లో భక్తులకు ఎక్కడా ఎలాంటి అసౌకర్యం కలగకుండా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆర్డీఓ జగదీశ్‌రెడ్డి సూచించారు. గురువారం ఆయన రెవెన్యూ, పంచాయతీరాజ్, పోలీస్‌శాఖల అధికారులతో కలిసి ఉర్సు ఏర్పాట్లను పరిశీలించారు. శుక్రవారం నిర్వహించే గంధం ఊరేగింపునకు రాష్ట్ర, జిల్లా స్థాయి ప్రముఖులు హాజరుకానున్నట్లు తెలిపారు. అదే విధంగా భక్తులు లక్షకుపైగా హాజరయ్యే అవకాశం ఉండటంతో అధికారులకు పలు సూచనలు చేశారు.


దర్గా వద్ద ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్

500 మంది పోలీసులతో బందోబస్తు

- ఎస్పీ రాహుల్ హెగ్డే

పాలకవీడు: జాన్‌పహాడ్ దర్గా ఉర్సు నేపథ్యంలో శుక్రవారం నిర్వహించే గంధం ఊరేగింపునకు భక్తులు పెద్ద సంఖ్యలో హాజరుకానుండడంతో 500 మంది పోలీసులతో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు ఎస్పీ రాహుల్ హెగ్డే తెలిపారు. గురువారం దర్గా వద్ద గల ఫంక్షన్ హాల్‌లో పోలీస్ సిబ్బందితో ఆయన సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. గంధం ఊరేగింపులో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూడాలన్నారు. దర్గాకు వచ్చే రూట్లన్నీ క్లోజ్ చేయాలని సూచించారు. వాహనాలు లోనికి రాకుండా బారికేడ్లను ఏర్పాటు చేసి కేటాయించిన పార్కింగ్ ప్రదేశాల్లోనే వాహనాలు నిలిపేలా చూడాలని తెలిపారు. సిబ్బంది 24 గంటలు రెండు విడతల్లో విధులు నిర్వహించాలని చెప్పారు. ఊరేగింపు పూర్తయ్యే వరకు రోప్ పార్టీ, స్పెషల్ టీం అప్రమత్తంగా ఉండాలన్నారు. దర్గా వద్ద కంట్రోల్‌రూం ఏర్పాటు చేయాలన్నారు. 16 సీసీ కెమెరాలతో ఉర్సును పర్యవేక్షిస్తామని పేర్కొన్నారు. ప్రముఖుల దర్శనానికి ఆటంకం కలగకుండా చూడాలన్నారు. సమావేశంలో ట్రైనీ ఐపీఎస్ రాజేష్‌మీణ, ఏఎస్పీ నాగేశ్వరరావు, డీఎస్పీ ప్రకాష్, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ రాజేష్, సీఐ రామలింగారెడ్డి, ఎస్సై లింగయ్య సిబ్బంది పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎస్పీ రాహుల్ హెగ్డే

గడువు తీరిన న్యూట్రిషన్ కిట్ల పంపిణీ

- చింతపల్లి పీహెచ్‌సీలో వైద్య సిబ్బంది నిర్వాకం
- గడువు ముగిసినట్లు తెలియడంతో అవాక్కైన లబ్ధిదారులు

చింతపల్లి: మాతాశిశు మరణాలను తగ్గించేందుకు ప్రభుత్వం గర్భిణులకు పంపిణీ చేస్తున్న న్యూట్రిషన్ కిట్ల పంపిణీలో చింతపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించారు. గురువారం పంపిణీ చేసిన న్యూట్రిషన్ కిట్ల గడువు తీరిపోవడంతో లబ్ధిదారులు అవాక్కయ్యారు. ఇటీవల చింతపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి 28, మాల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి 18 న్యూట్రిషన్ కిట్లు వచ్చాయి. అయితే కిట్ల గడువు తీరిపోయి ఉంటే పంపిణీ చేయొద్దని జిల్లా వైద్యశాఖ ముందస్తుగానే సూచించింది. దీంతో మాల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గడువు తీరిపోయిన న్యూట్రిషన్ కిట్లను పంపిణీ చేయలేదు. కానీ చింతపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మాత్రం గురువారం గర్భిణులకు అవే న్యూట్రిషన్ కిట్లను పంపిణీ చేశారు. తీరా ఇంటికెళ్లి చూసుకున్న లబ్ధిదారులు తమకు అందించిన కిట్లు గడువు తీరిపోయి ఉండడాన్ని చూసి అవాక్కయ్యారు. గడువు తీరిన న్యూట్రిషన్ కిట్లు ఉపయోగించడం వలన గర్భిణులకు ఏదైనా ఆరోగ్య సమస్యలు తలెత్తితే ఎవరు బాధ్యత వహిస్తారంటూ పీహెచ్‌సీ వైద్యాధికారి తీరును తప్పుపడుతున్నారు.


చింతపల్లి పీహెచ్‌సీలో న్యూట్రిషన్ కిట్లు పంపిణీ చేస్తున్న వైద్య సిబ్బంది


గడువు తీరిన కిట్‌లోని ప్రాడక్ట్

కిట్లను వెనక్కి తీసుకుంటాం

గడువు ముగిసిన న్యూట్రిషన్ కిట్లను పంపిణీ చేసినట్లు గుర్తించాం ఈ మేరకు ఆశా వర్కర్లకు సమాచారం ఇచ్చి పంపిణీ చేసిన కిట్లను తిరిగి వెనక్కి తీసుకురావాలని చెప్పాం. గడువు ముగిసిన కిట్లను తీసుకొని నూతన కిట్లను అందజేస్తాం.

– శ్రీదేవి, మండల వైద్యాధికారి, చింతపల్లి

యువత ఓటరుగా నమోదు చేసుకోవాలి

చౌటుప్పల్: 18ఏళ్లు నిండిన యువత ఓటు హక్కు కోసం నమోదు చేసుకోవాలని బీజేపీ యాదాద్రి జిల్లా మాజీ అధ్యక్షుడు పీవీ శ్యాంసుందర్‌రావు అన్నారు. జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకొని బీజేవైఎం ఆధ్వర్యంలో గురువారం చౌటుప్పల్ పట్టణ కేంద్రంలో నమో నవమతదాత సమ్మేళనం నిర్వహించారు. పెద్ద సంఖ్యలో హాజరైన విద్యార్థులు, యువత తదితరులు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వర్చువల్‌గా చేసిన ప్రసంగాన్ని ఎల్‌ఈడీ స్క్రీన్ ద్వారా వీక్షించారు. ఈ సందర్భంగా శ్యాంసుందర్‌రావు మాట్లాడుతూ.. భారతదేశాన్ని ప్రపంచంలోనే నంబర్‌వన్ స్థానంలో నిలపాలంటే యువత సరైన రీతిలో తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా దేశాభివృద్ధే లక్ష్యంగా ప్రజాప్రతినిధులను గెలిపించుకోవాలని సూచించారు. అవినీతిరహిత, నీతివంతమైన పాలన అందిస్తున్న ప్రధాని నరేంద్ర మోదీకి దేశంలోని ప్రతి పౌరుడు అండగా ఉండాలన్నారు. బీజేవైఎం చౌటుప్పల్ మున్సిపాలిటీ అధ్యక్షుడు చింతకింది కిషోర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు రమనగోని శంకర్, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ పోలోజు శ్రీధర్ బాబు, నాయకులు దూడల భిక్షం, గుజ్జుల సురేందర్‌రెడ్డి, తరుణ్‌రెడ్డి, ఆలూరి శ్యాం, ఊడుగు వెంకటేశం, దాసోజు భిక్షమాచారి, జక్కలి రాజు, రాజశేఖర్, పబ్బు వంశీ, అక్కెనపల్లి శివ, సందగళ్ల కిరణ్, పాలెం వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న పీవీ శ్యాంసుందర్‌రావు

మట్టపల్లి క్షేత్రంలో నిత్యకల్యాణం

మఠంపల్లి: మఠంపల్లి మండలంలోని మట్టపల్లి శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో శ్రీరాజ్యలక్ష్మి చెంచులక్ష్మీ సమేత శ్రీలక్ష్మీనరసింహస్వామి నిత్య కల్యాణాన్ని గురువారం అర్చకులు వైభవంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయంలో సుప్రభాత సేవ, పంచామృతాభిషేకం, నిత్యహోమం పూర్తి గావించారు. అనంతరం శ్రీస్వామి అమ్మవార్లను నూతన పట్టు వస్త్రాలతో అందంగా ముస్తాబుచేసి ఎదుర్కోళ్ల మహోత్స సంవాదం రసవత్తరంగా చేపట్టారు. ఆ తర్వాత విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనం, రక్షాబంధనం, రుత్విగ్వరణం , పంచగవ్య ప్రాశన, మధుపర్కపూజ, మాంగల్యధారణ, తలంబ్రాలతో వైభవంగా కల్యాణతంతును ముగించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు మట్టపల్లిరావు, విజయ్‌కుమార్, ఈఓ నవీన్‌కుమార్, అర్చకులు తదితరులు పాల్గొన్నారు.

కోదాడ పీఏసీఎస్ చైర్మన్‌పై నెగ్గిన అవిశ్వాసం..!

- అవిశ్వాస తీర్మానం నిలిపివేయాలని కోర్టును ఆశ్రయించిన చైర్మన్ ఆవుల రామారావు
- 30వ తేదీ వరకు ఫలితాలు వెల్లడించొద్దని కోర్టు ఆదేశాలు

కోదాడ: కోదాడ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ ఆవుల రామారావుపై సంఘం డైరెక్టర్లు ప్రతిపాదించిన అవిశ్వాస తీర్మానం నెగ్గినట్లు తెలిసింది. విశ్వసనీయ సమాచారం ప్రకారం.. గురువారం జిల్లా సహకార అధికారి శ్రీధర్ ఆధ్వర్యంలో కోదాడ సొసైటీ కార్యాలయంలో అవిశ్వాసంపై సమావేశం నిర్వహించారు. సంఘంలో ఉన్న 13 మంది డైరెక్టర్లలో చైర్మన్ మినహా మిగతా 12 మంది సమావేశానికి హాజరై అవిశ్వాసానికి అనుకూలంగా చేతులెత్తినట్లు తెలిసింది. కాగా తనపై పెట్టిన అవిశ్వాస తీర్మానం నిలిపివేయాలని చైర్మన్ ఆవుల రామారావు కోర్టును ఆశ్రయించగా.. అవిశ్వాస తీర్మానం పెట్టండి కానీ ఫలితాన్ని ఈ నెల 30వ తేదీ వరకు ప్రకటించొద్దని కోర్టు ఆదేశాలు జారీ చేసింది. దీంతో ఈ నెల 30న మరోసారి సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడిస్తామని అధికారులు తెలిపారు.


సమావేశానికి హాజరైన సొసైటీ డైరెక్టర్లతో కాంగ్రెస్ నాయకులు

పేదలకు విద్య, వైద్యం అందించడమే లక్ష్యం

- ఆమ్ ఆద్మీ పార్టీ రాష్ట్ర కన్వీనర్ దిడ్డి సుధాకర్

భానుపురి (సూర్యాపేట): దేశంలోని నిరుపేదలందరికీ ఉచిత విద్య, వైద్యం అందించడమే ఆమ్ ఆద్మీ పార్టీ(ఆప్) ప్రధాన లక్ష్యమని ఆ పార్టీ తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ దిడ్డి సుధాకర్ అన్నారు. గురువారం సూర్యాపేట జిల్లా కేంద్రంలో పార్టీ జిల్లా నూతన కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా దిడ్డి సుధాకర్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో బలమైన ఉద్యమాన్ని నిర్మించేందుకు ఆప్ ప్రణాళికలు సిద్ధం చేస్తుందన్నారు. నలుగురితో పెట్టిన పార్టీ రెండు రాష్ట్రాల్లో అధికారంలోకి రావడమే కాకుండా ప్రధాన మంత్రిగా పోటీ చేసే స్థాయికి చేరుకుందన్నారు. విద్య, వైద్యం అందరికీ అందడం లేదని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజల ఆస్తులను ప్రైవేట్‌కు ధారాదత్తం చేస్తూ కార్పొరేట్లకు కొమ్ముకాస్తోందన్నారు. ఢిల్లీ, పంజాబ్ రాష్ట్రాలలో ఆమ్ ఆద్మీ ప్రభుత్వాలు ఉచిత విద్య, వైద్యం అందిస్తున్నాయన్నారు. కేజ్రీవాల్‌ను అనగదొక్కడానికే ప్రధానమంత్రి అక్రమ కేసులు పెట్టిస్తున్నారని, 5200 కేసులు పెడితే కేవలం 22 కేసుల్లో మాత్రమే తీర్పు వచ్చిందన్నారు. బీజేపీలో చేరిన వారిపై మాత్రం కేసులు మాయమవుతున్నాయని అన్నారు. అనంతరం పార్టీ సూర్యాపేట జిల్లా అధ్యక్షుడిగా ఇందారపు రాజమల్లయ్య, యువజన అధ్యక్షుడిగా తక్కెళ్లపల్లి ప్రశాంత్, ప్రధాన కార్యదర్శిగా మిద్దె బాబురావు, ఉపాధ్యక్షులుగా రింగు ఐసయ్య, తన్నీరు వెంకన్నకు నియామక పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కోర్ కమిటీ సభ్యులు డాక్టర్ అన్సారి, బత్తుల రాముగౌడ్, నల్లగొండ జిల్లా అధ్యక్షుడు కుత్బుల్లా పాల్గొన్నారు.


నియామక పత్రాలు అందజేస్తున్న దిడ్డి సుధాకర్

ఓటు వజ్రాయుధంలాంటిది

- రిటైర్డ్ ఐఏఎస్ అధికారి చొల్లేటి ప్రభాకర్

హుజూర్‌నగర్ : ఓటు వజ్రాయుధంలాంటిదని దానిని సద్వినియోగం చేసుకోవాలని రిటైర్డ్ ఐఏఎస్ అధికారి చొల్లేటి ప్రభాకర్ అన్నారు. గురువారం జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా హుజూర్‌నగర్‌లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్స్‌పాల్ ఎం. భీమార్జున రెడ్డి అధ్యక్షతన ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాజ్యాంగం ప్రజలచేతికిచ్చిన ఓటుహక్కును దుర్వినియోగం కాకుండా చూసుకోవాల్సిన బాధ్యత యువత భుజస్కంధాలపై ఉందన్నారు. ఓటును మద్యానికి, డబ్బుకు అమ్ముకోవడం ఈనాటి వ్యవస్థలో సాధారణమైపోయిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. దీనిని మార్చాల్సిన బాధ్యత నేటి యువత చేతుల్లోనే ఉందని సూచించారు. ఓటర్లు చైతన్యవంతులైనప్పుడే ఓటు హక్కును సద్వినియోగం చేసుకొని సరైన నాయకుడిని ఎన్ను కోగలుగుతారన్నారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ సమన్వయకర్తలు, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ప్రభాకర్

దళిత మహిళను దించాలనుకోవడం కుట్రపూరితం

- టీఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు శ్రీరాములు

భానుపురి (సూర్యాపేట): 70 సంవత్సరాల సూర్యాపేట మున్సిపల్ చరిత్రలో జనరల్ స్థానంలో దళిత మహిళను మాజీ మంత్రి జగదీష్ రెడ్డి మున్సిపల్ చైర్‌పర్సన్‌గా చేస్తే నేడు అధికార పక్షం .. అవిశ్వాసం పెట్టి దించాలను కోవడం కుట్ర పూరితం అని టీఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు తప్పెట్ల శ్రీరాములు మాదిగ ధ్వజమెత్తారు. సూర్యాపేట మున్సిపల్ చైర్ పర్సన్ పెరుమాళ్ల అన్నపూర్ణపై పెట్టిన అవిశ్వాసాన్ని ఉపసంహరించుకోవాలని కోరుతూ గురువారం సస్థానిక బాబు జగ్జీవన్ రావ్ విగ్రహం వద్ద ఆందోళన నిర్వహించి మాట్లాడారు. నాలుగేళ్ల పరిపాలనలో మున్సిపల్ చైర్‌పర్సన్ అన్నపూర్ణ చేసిన అవినీతి ఏమిటో, చేయని అభివృద్ధి ఏందో చెప్పాలన్నారు. సూర్యాపేట మున్సిపాలిటీ పరిధిలో ఏ ఒక్క వార్డును నిర్లక్ష్యం చేయకుండా అన్నింటికీ సమానంగా నిధులు కేటాయించి అభివృద్ధి చేసిన ఘనత మున్సిపల్ చైర్‌పర్సన్ అన్నపూర్ణకే దక్కుతుందన్నారు. అధికార పక్షంలో ఉంటేనే అభివృద్ధి జరుగుతుందని అనుకోవడం పొరపాటని అగ్రవర్ణాలతో కలిసి అధికారపక్షం ఆడించే కుట్రలో కౌన్సిలర్లు బలి కావొద్దని అన్నారు. కౌన్సిలర్లు ఇప్పటికైనా అవిశ్వాసాన్ని ఉపసంహరించుకొని చైర్‌పర్సన్ అన్నపూర్ణతో కలిసి పట్టణాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో టీఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు శ్రావణ్ కుమార్ మాదిగ, పట్టణ అధ్యక్షుడు పిడమర్తి మధు, జిల్లా మహిళా అధ్యక్షురాలు బొడ్డు సైదమ్మ, నియోజకవర్గ ఇన్‌చార్జి బొడ్డు మల్సూర్ తదితరులు ఉన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న శ్రీరాములు

ఓటు హక్కు జీవన మనుగడకు నాంది

- మహాత్మా గాంధీ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ గోపాల్‌రెడ్డి

ఎంజీయూ (నల్లగొండ రూరల్): ఓటు హక్కు జీవన మనుగడకు నాంది అని మహాత్మా గాంధీ యూనివర్సిటీ(ఎంజీయూ) వైస్ చాన్సలర్ గోపాల్‌రెడ్డి అన్నారు. గురువారం యూనివర్సిటీలో నిర్వహించిన జాతీయ ఓటర్ల దినోత్సవంలో ఆయన మాట్లాడారు. ఓటు హక్కు ఉన్నవారు ఎలాంటి ప్రలోభాలకు గురికాకుండా మంచి నాయకుడిని ఎన్నుకోవాలన్నారు. 18 సంవత్సరాలు పైబడిన వారంతా ఓటు హక్కు కోసం నమోదు చేసుకోవడంతో పాటు ఎన్నికల్లో తప్పనిసరిగా ఓటు వేయాలన్నారు. అంతకుముందు విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో యూనివర్సిటీ రిజిస్ట్రార్ అల్వాల రవి, అధ్యాపకులు మద్దిలేటి, సైదులు, శేఖర్, స్వప్న, తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న మహాత్మా గాంధీ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ గోపాల్‌రెడ్డి

అభ్యాసన సామర్థ్యాలను పెంచాలి

నల్లగొండ రూరల్: విద్యార్థుల్లో అభ్యాసన సామర్థ్యాలను పెంచాలని మహాత్మా గాంధీ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ గోపాల్‌రెడ్డి, నేషనల్ కౌన్సిల్ ఆఫ్ టీచర్ ఎడ్యుకేషన్ న్యూఢిల్లీ సభ్యుడు శంకర్ అన్నారు. గురువారం నల్లగొండ మున్సిపాలిటీ పరిధిలోని చర్లపల్లిలో గల డీవీఎం ఎంఈడీ కళాశాలలో నిర్వహించిన స్నాతకోత్సవంలో పాల్గొన్నారు. 2021–2024 విద్యా సంవత్సరంలో ఎంఈడీ పూర్తిచేసిన మొదటి బ్యాచ్ విద్యార్థులకు స్నాతకోత్సవం సందర్భంగా పట్టాలు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ గంగాధర్‌రావు, వైస్ ప్రిన్సిపాల్ బొడ్డుపల్లి రామకృష్ణ, సోమరాజు, నారాయణరెడ్డి, శ్రీదేవి, పుష్పాంజలి, శ్రీధరచారి, సత్యనారాయణ, నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

బారులుదీరిన పత్తి వాహనాలు


మునుగోడులోని సీసీఐ కొనుగోలు కేంద్రం వద్ద బారులదీరిన పత్తి వాహనాలు

మునుగోడు: గత ఏడాది ప్రభుత్వ మద్దతు ధర కంటే ప్రైవేట్ వ్యాపారులు అధిక ధర ఇవ్వడంతో రైతులు వారికి పత్తిపంటను అమ్ముకొని లాభపడ్డారు. ఈ ఏడాది కూడా అలాగే భావించి చాలామంది రైతులు ఇళ్లలో పత్తిని నిల్వ చేసుకున్నారు. కానీ బయట మార్కెట్‌లో ధర పడిపోతుండటంతో సీసీఐ కేంద్రాల్లో పత్తిని అమ్ముకునేందుకు వస్తున్నారు. కానీ సీసీఐ కేంద్రాల్లో కొనుగోళ్లు మందకొడిగా సాగుతుండటంతో రైతులు రోజుల తరబడి పడిగాపులు కాయలేక బయట తక్కువ ధరకే అమ్ముకుంటున్నారు. మునుగోడులోని సీసీఐ కొనుగోలు కేంద్రం ఎదుట కూడా భారీగా పత్తి లోడు వాహనాలు బారులుదీరాయి.

ఆస్పత్రిలో చికిత్సపొందుతూ వృద్ధురాలి మృతి

- వైద్యుల నిర్లక్ష్యంతోనే చనిపోయిందని బంధువుల ఆందోళన
- వరంగల్‌లోని ప్రైవేట్ ఆస్పత్రిలో ఘటన
- మృతురాలి స్వస్థలం సూర్యాపేట జిల్లా మద్దిరాల

వరంగల్: సూర్యాపేట జిల్లా మద్దిరాలకు చెందిన వృద్ధురాలు వరంగల్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందింది. అయితే వైద్యుల నిర్లక్ష్యంతోనే వృద్ధురాలు మృతి చెందిందని ఆరోపిస్తూ గురువారం సీపీఎం ఆధ్వర్యంలో ఆ ఆస్పత్రి ఎదుట ఆందోళన చేపట్టారు. మృతురాలి బంధువుల కథనం ప్రకారం.. ఈ నెల 20వ తేదీన సూర్యాపేట జిల్లా మద్దిరాలకు చెందిన రాంపాక భద్రమ్మ ఇంట్లో కాలుజారి కింద పడింది. చికిత్స నిమిత్తం వరంగల్‌లోని బాలాజీ ఆస్పత్రికి తీసుకొచ్చారు. వెంటనే ఆస్పత్రిలో వైద్యుడు పరిశీలించి తుంటి విరిగిందని నిర్ధారించారు. కాగా, ఆపరేషన్‌కు సహకరించడం లేదని భద్రమ్మ కాళ్లు, చేతులు కట్టి వేసి మత్తు ఇంజక్షన్ వేసి సర్జరీ చేశారు. దీంతో కోమాలోకి వెళ్లిన భద్రమ్మ మూడు రోజులైనా స్పృహలోకి రాకపోవడంతో డాక్టర్లను బంధువులు మందలించారు. ఇంకో ఇంజక్షన్ వేస్తే కోలుకుంటుందని చెప్పి సిబ్బందితో వేయించారు. 25వ తేదీన తెల్లవారుజామున భద్రమ్మ మృతి చెందిందని, ఆమె మృతదేహం తీసుకెళ్లాలని డాక్టర్లు తెలిపారు. దీంతో ఆపరేషన్ సమయంలో మోతాదుకు మించి మత్తు ఇచ్చి భద్రమ్మను బలిగొన్నారని, బాలాజీ హాస్పిటల్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని సీపీఎం నాయకులతో కలిసి బంధువులు ఆందోళన చేపట్టారు. బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఆస్పత్రి ఎదుట ట్రాఫిక్ జామ్ కావడంతో పోలీసులు వారిని నిలువరించే ప్రయత్నం చేశారు.


ఆస్పత్రి ఎదుట నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులను నిలువరిస్తున్న పోలీసులు